కథా నిలయం
5857
శ్రీకాకుళం

# ఆ నా టి రా త్రి

"On such a night as this—" అని ఆగాడు రాజయ్య ఉమ్మేసుకోడానికని కిటికీ తెరిచి వెన్నెలవంక చూస్తూ.

ప్రేమ ఎంత అనవసరమనీ, అదో బూర్జువాజబ్బనీ, డబ్బూ, ఘనతా, కుటుంబాభ్యుదయమే ఆదర్శమనీ, ఎంత ఎందరు మొత్తుకున్నా ఎనక, ఆ కార్తీకమాసపు రాత్రి వెన్నెల రాళ్ళని చలవరాళ్ళగా, మురుగుకాలవల్ని తేటనీటి సెలయేళ్ళగా, చీకటి గొందుల్ని ఆకాశమార్గాలగా, చివరికి అభ్యుదయాసక్తమైన ఇరుకు హృదయాల్నికూడా కలలోకి చిగిర్చేట్టు చేస్తోంది. అదేమీ గమనించతలచుకోని ఇద్దరు Selfmade successful కుటుంబీకులు చలిగాలికి దడిసి తలుపులు వేసుకుని కుర్చీలలో పడుకున్నారు. ఒకాయన చుట్ట కాలుస్తున్నాడు. ఇంకోఆయన కబుర్లకి ఉద్యుక్తుడౌతున్నాడు. జీవితాన్ని తమ స్వంత శ్రమవల్ల విజయవంతం చేసుకున్నంత భరించరాని మనుష్యుల్ని చూడడం కష్టం. బైటికి చాలా Polished పెద్దమనుషులే. కాని వాళ్ళ దుర్మార్గం భార్యలమీదా, పిల్లలమీద వారిమీద ఆధారపడే వారిమీదా, యాచించవచ్చిన వారిమీదా కనపడుతుంది. ఆజ్ఞలు పెట్టరు, దడిపించరు, వ్యక్తి స్వేచ్ఛా అవీ మాట్లాడుతారు. వారికి ఏ విషయమైనా సరే తీర్చి, కొలిచి, అంచులు చెక్కిన అభిప్రాయాలు. దేవుడు, సంఘసంస్కారం, యోగులు, ధనోపయోగం, మర్యాద - వీటిల్లో వారినించి భేదాభిప్రాయాలకి వారి సంసారాల్లో చోటివ్వరు. మిత్రులలో చాలా మార్జిన్ వొదిలి వొప్పుకుంటారు. కాని తమవారు అనేవారిలో సహించరు. వారితో వాదించరు. తాము స్పష్టంగా నమ్ముతారు; తాము నమ్మేదే సరైనసంగతి అని. ఆ అభిప్రాయాలతో వాతావరణాన్ని నించుతారు. కందిపచ్చడిలో వెల్లుల్లిపాయ వేయవచ్చునా కూడదా అనే ప్రశ్నకూడా రాదు. వెయ్యకూడదు అని తోస్తే, అంతే. రెండోరుచికి ఆ యింటో చోటువుండదు. వెయ్యావొద్దని అనరు. కాని వెయ్యడానికి ఎవరికీ గుండెలువుండవు. పిల్లలు ఏవిధంగా

వర్తించాలో భార్యకి ఆదేశిస్తారు. "నాన్నగారికి ఇష్టంలేదు" అంటే చాలు దేవుడికి ఇష్టంలేదన్నమాటే. బీద విద్యార్థులూ, ముష్టివాళ్ళు, పండితులూ యాచనికి వొస్తే, లెక్చర్లిచ్చి, అట్లా యాచించడం ఎంత నీచమో, తాము యాచించకుండా అంత ఘనతికి ఎట్లా రాగలిగారో తమ స్వీయచరిత్రని చెప్పి పంపిస్తారు. జీవితం ఏదుడుకూ లేకుండా సాగాలి. కలవారి మనసు చాల సుకుమారం. ఏదన్నా కలవరం ఏ పిల్లగాని ఎవరుగాని కలిగించారా, మాటలాడని ఆగ్రహంతో ఆ పిల్లని గిజగిజలాడిస్తారు. ఆయన తన గదిలో కోపంగా కూచున్నాడా ఇల్లంతా ఉష్ణజ్వాలలు సమస్త ప్రాణుల్నీ ఉడికించేస్తాయి. దీంటో ప్రపంచోద్ధరణగాళ్ళు వుంటారు. వాళ్ళు దానిని గురించి వ్యాసాలేగానీ, అసలు కానీ వొదలరు. సంఘుస్వరూపమే, ఆర్థిక విధానమే మారాలి అని బోధిస్తో వుంటారు. పైపై స్నేహానికి సరదాగా వుంటారు గాని, లోపల కుష్టరోగుల శరీరం నయం, వాళ్ళ ఆత్మలకంటె వాళ్ళ మామూలు నమ్మకాలకీ మనోశాంతికీ భంగం కలిగించే మహిమలుగాని, వింతలుగాని, ఉన్నాయని తమకన్న ఉదారమైన ఉన్నతమైన శక్తులున్నాయని వింటే వాళ్ళు విసంగా నవ్వుతారు. బుద్ధిహీనుల నమ్మకాలంటారు. వాటిసంగతి తమకేమీ తెలీకపోయినా, అవి జిత్తులని వాటివెనకవుండే రహస్యాల్ని నూహించి విశదంచేస్తారు. కవిత్వం, ప్రణయం, యోగం, త్యాగం, ఇవి కనపడ్డాయా మండిపడతారు. ఏవో ఆదర్శాలు పెట్టుకుని జీవితాల్ని ధ్వంసం చేసుకునేవాళ్ళమీద చాలా అసహ్యం, తృణీకారం.

చేష్టలోగాని మాటలోగాని ఎప్పుడూ తమనిమరచి ఒక ఉద్రేకంలోకిగాని ఉత్సాహంలోకిగాని పోరు. జాగ్రత్తగా సరిచూసుకుంటో, తోవ తడుముకుంటో, లెక్కలు వేసుకుంటో, బలువుగా లావుగా పందికొక్కుల మల్లే జీవితంలో కన్నాలు చేసుకుంటో పోతోవుంటారు, దొలిచినమట్టినంతా ఎవరికీ కనపడకుండా వెనక్కితోసుకుంటో. జాగ్రత్తగా రుచిగా తమ రూల్సు ప్రకారం వంటచేయించుకుని పొట్టనిండా తినడమూ, పని చూసుకోడమూ, రాత్రి లెక్కప్రకారం సంసారం చెయ్యడమూ, ఇంతే దినచర్య. వాళ్ళకి సుకుమార హృదయాలకి అయిష్టమైన మాటగాని, పేరుగాని, ఉద్దేశ్యంగాని, వినపడకూడదు. వీరి ఉద్దేశ్యాలను శిరసావహించి, ఇంకోవిధంగా గాలి పీల్చుకోడానికికూడా భయబడే భార్యా, పిల్లా, తల్లీ, అత్తా, తమ్ముడూ, కోడలూ, ఆ ఉద్దేశ్యాలే, అభిరుచులే, చాలా గొప్పవనీ, సరైనవనీ, నమ్మి

వాటిని చూచుకొని గర్వపడతారు. వాళ్ళట్లా గర్వపడేటట్టు చేస్తారు ఈ సమర్థులు. ఏదైనా విరుద్ధాభిప్రాయం ఇతరులెవరిద్వారానన్నా ఇంటో ప్రవేశించిందా వెంటనే సునాయాసంగా దాన్ని హత్యచేస్తారు, (విషంగా) నవ్విగాని, కనుబొమలు ముడిచిగాని, "ఇంకచాలు. ఈసారి ఆ మాట వినసీ బడకండి" అనిగాని.

అన్నీ హద్దులు. ప్రేమగాని, స్నేహంగాని, పరిచయంగాని, డబ్బుగాని – 'ఇంతవరకు' అంతే, అని అంచులు చక్కగా కత్తిరించినట్లు సంబంధాలు పెట్టుకుంటారు. వాళ్ళకి కోపం ఎన్నడూరాదు. పైకి కనపడదు. నవ్వుతోనే గొంతు కత్తిరిస్తారు. ఆ తెగినమనిషే. భరించలేక వొచ్చి వాళ్ళ ముందే గోలకత్తితే "అట్లా చేస్తే ఇట్లానే జరుగుతుంది." అని తమకి సంబంధం లేనట్టు, ఆ శిక్ష ఈశ్వరుడి చట్టప్రకారం వాళ్ళమీద పడ్డట్టు మాట్లాడతారు. వాళ్ళ కేఅపాయమూరాదు. అపాయాలూ, నష్టాలు, దురదృష్టాలు పట్టిన వాళ్ళమీద వాళ్ళకి కనికరంరాదు. "చేసుకున్నావు అనుభవించు" అంటాయి వాళ్ళకళ్ళు. స్వశక్తివల్ల అభ్యుదయమందినవాళ్ళు గనుక, వాళ్ళకి స్వశక్తిమీద విశ్వాసం, ఈశ్వరుడంటే వాళ్ళకేమాత్రమూ గిట్టదు. చాలా అనవసరం. వేరేశక్తి వాళ్ళఅవసరాలకి.

దూరంనించి అపాయం వొస్తున్నట్టుతోచిందా, చల్లగా తప్పుకుని పక్కవారిమీదనించి అపాయాన్ని దొర్లిపోనిస్తారు. ఇంకెవరూ లేకపోతే భార్యమీదనైనాసరే – ప్రియురాలు అసలువుండనేవుండదు, ప్రేమఅంటే హేళనగనక. ప్రేమని ఎరగనే ఎరగవు ఆ హృదయాలు. ఏ ఉద్రేకంవల్ల నన్నా మనిషి కదిలి పట్టాలు తొలిగాడా, దాన్ని ఓ రోగమంటారు.

ఆ రాత్రి ఆ గదిలో కుర్చీలలో పడుకున్న పెద్దమనుషు లిద్దరూ typical self-made men కాని వాళ్ళిద్దరిజీవితాల్లోనూ స్త్రీమీద మమత, ప్రభావం బలంగా పనిచెయ్యడంవల్ల పైపునించి ఛేదించారు చెరోవిధంగాను. ఎటువంటిస్త్రీ అయినాసరే, ప్రేమించిందంటే, ఆ పురుషుడి స్వభావంలో, అతను మొత్తంమీద ఎంతనీచుడూ, క్రూరుడైనా, ఒక భాగానికి ఓ ఔన్నత్యం పట్టే వుంటుంది, ఆ ప్రేమ పట్టుగా కొంతకాలం వాళ్ళ జీవితాన్ని పరిపాలిస్తే క్రమంగా పెద్దమృదువైనమార్పు కలుగుతుంది. ఎటువంటి కర్కశస్వభావంలో కూడా కొంతవిశాలత్వం ఏర్పడుతుంది.

ఆ గదిలో ఆ రాత్రి పదకొండు గంటలప్పుడు కుర్చీలలో హాయిగా పడుకున్న మిత్రులు ఇద్దరూ వయసుమళ్ళినవాళ్ళే. చిన్నప్పుడు స్కూలులో కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఆ యింటి యజమాని రిటైరైన కాలేజీ లెక్చరరు, శ్యామారావు. ఆయన అతిథి మిత్రుడు, చాలా డబ్బు సంపాయించిన వకీలు రాజయ్య. కాలేజీలో విడిపడి ముప్ఫైఏళ్ళ చిల్లర తరువాత ఇదే కలుసుకోడం వాళ్ళు. రాజయ్య తన కూతురుకి సంబంధం చూడ్డానికి ఆవూరు వొచ్చి తన మిత్రుడిఇంటో దిగాడు. రెండోరోజు రాత్రి అది.

చుట్టకాలుస్తూ ఉమ్మేసుకోడానికని లేచి రాజయ్య "On such a night as this- జ్ఞాపకముందా?" అంటో వొచ్చి కుర్చీలో పడుకున్నాడు, పైకప్పువేపు పొగవొదులుతో. కొంచం సేపు మాట్లాడలేదు ఎవరూ. నిశ్శబ్దం నాలుగు నిమిషాలే. కాని ఏళ్ళ జ్ఞాపకాలు :

పక్కన రైలుకట్ట. దానిమీద వంతెనకిందనించి దొర్లుకుంటూ వొచ్చే పంటకాలవ, వెన్నెట్లో ఆనీళ్ళన్నీ పాలైనాయి. కాలవకట్టన పొగడచెట్టు. దానికింద ముగ్గురు మిత్రులూ సహాధ్యాయులూ అట్లాంటి కార్తీకపు వెన్నెల రాత్రే - మధ్య విశాలాక్ష్మి, చెరోకపక్కనా వీళ్ళిద్దరూ హుషారైన యువకులు - ఎన్నేళ్ళకిందటో. ఆ రాత్రి ముగ్గురూ తోడిరాగంలో పాడారు. షేక్స్పియర్ ఇంగ్లీషుపాటని- On such a night as this- అని తప్పులతో ముగ్గురూ కంఠాలు కలిపి. కాని రెండు కంఠాలు కలవడం సులభంగాని, మూడు కలవ్వు.

అసలు మొదట శ్యామారావుకి విశాలాక్షికి స్నేహం. చదువుకునే స్త్రీలని స్వతంత్రురాలైనవారినీ చూస్తే అతనికి Fancy. అందుకని ఆమెకి తన నోట్సు ఇవ్వడమూ, ఆమెకి చదువు విషయమై సలహాలివ్వడమూ అతనికి సరదా. శని ఆదివారాలు ఆమె యింటికివెళ్ళి ఆమెని 'కోచ్' చేసేవాడు కూడా. అతని ఆప్తమిత్రుడు రాజయ్యకి ఇట్లాంటి స్నేహాలు ఏమాత్రం గిట్టవు. కనుక మిత్రుణ్ని Warn చేసి వారించాలని చూశాడు. కాని శ్యామారావు వినలేదు. త్వరలో విశాలాక్షి, శ్యామారావుల పేర్లు గోడలమీది కెక్కాయి. వాళ్ళపెద్దవాళ్ళకి ఆకాశరామన్న ఉత్తరాలు వెళ్ళాయి. దాంతో వాళ్ళిద్దరికీ చాలా సిగ్గేసింది. తమ స్నేహాన్ని ఇట్లా అసహ్యంగా ప్రచురిస్తారని వాళ్ళెన్నడూ అనుకోలేదు. విశాలాక్షి కాలేజీ

రాలేదు వరసగా నాలుగురోజులు. శ్యామారావుకి దిగులు పట్టుకుంది. తన మూలంగా విశాలాక్షిని చదువు మానిపించారేమోనని. అంతేకాదు, ఆమెని చూడకండా ఉండలేనని అప్పుడే తెలియవొచ్చింది. ఆమెని ఆమె తలిదండ్రులు ఏం బాధపెడుతున్నారో! ఓ సాయింత్రం శ్యామారావు వాళ్ళ యింటివేపు వెడితే విశాలాక్షి తండ్రి అతన్ని ఇంక ఆయింటివేపు రావొద్దని కఠినంగా చెప్పాడు. శ్యామారావు డెస్పరేట్ ఐ తన మిత్రుణ్ని విశాలాక్షి ఎట్లా వుందో చూసిరమ్మని బతిమాలుకున్నాడు. రాజయ్య నిరాకరించాడు. నేను చెప్పలేదా? అని ఎత్తిపొడిచాడు. చివరికి మిత్రుడి అవస్తని భరించలేక వెళ్ళడానికి వొప్పుకున్నాడు. శ్యామారావు ఓ ఉత్తరంకూడా యిచ్చాడు. రాత్రి కానిచ్చి వెళ్ళి విశాలాక్షిని పిలిచాడు. వాళ్ళ యింటో కొంచెం మాట్లాడి ఉత్తరం ఇస్తోవుండగా విశాలాక్షి తండ్రి చూసి ఏవరో సరిగా గమనించకండానే, ఉత్తరం లాక్కొని, "నిన్ను ఇటురావొద్దని చెప్పలేదురా నా పిల్లని బతకనియ్యవా?" అంటో మెడపట్టుకుని గెంటాడు రాజయ్యని. అర్భకుడైన రాజయ్య హఠాత్తుగా జరిగిన ఆ తోపుతో గుమ్మంలో కింద పడ్డాడు. రాత్రి పదింటికి శ్యామారావు గదికివొచ్చి రాజయ్య తనకి జరిగిందంతా చెప్పాడు. ఆనాటినుంచి వాళ్ళిద్దరి స్నేహము మరింత బలపడ్డది. ఆరాత్రి వాళ్ళిద్దరూ పూర్వం ఇట్లాంటిరాత్రే వాళ్లు ముగ్గురూ కూచుని పాడిన సంగతి జ్ఞాపకం తెచ్చుకుంటున్నారు.

శ్యామారావు అన్నాడు

"అదొక్కసారే ననుకుంటా నువ్వు విశాలాక్షితో స్వేచ్ఛగా కూర్చున్నది, కాలేజిలో చూడడంకాకండా.

అనుమానిస్తో చిన్నసిగ్గు చిరునవ్వుతో రాజయ్య 'ఊ' అన్నాడు. ఆ చిరునవ్వుని ఆ దీపంవెలుతురులో చూడలేదు శ్యామారావు, "అది రామయ్యనాయుణ్ణి పెళ్ళిచేసుకుంది. మునిసిపల్ కౌన్సిలరుకూడా అయిందని విన్నాను, తరువాత నేనూచూడలేదు. నువ్వుచూశావా?"

లేదు అని తలతిప్పాడు రాజయ్య.

"ఆరోజుల్లో నీ సహాయం ఎంత నాకు బలమిచ్చిందో, అంతా జ్ఞాపకముంది నాకు. పాపం, నీకు ముట్టిండల్లా ఆ తండ్రినించి చివాట్లు."

"నీకుమాత్రం ముట్టిందేముందిలే!"

"ఎంతసినికల్ గా మాట్లాడుతున్నావోయ్. ఏమన్నా ముట్టాలా! ఆ లెక్కలన్నీ మన హృదయాలమీద జీవితపుమురికి పేరుకున్నతరువాత. కాని

ఆ యవ్వనంలో, మొదట ఓయువతిని ప్రేమించగలగడం - ఆమెనించి ఒక్క చిన్నచూపు, చిరునవ్వు - అవన్నీ ఎంత అమూల్యం!"

"ఏం విరహాపడేవాడివి!"

"చెప్పుకోడానికి నువ్వు లేకపోతే అంత విరహాపడేవాణ్ణి కాదేమో! నీ కట్లాంటి గొడవలు ఏమీవుండేవి కావు. అదృష్టవంతుడివి."

"ప్రేమించడమే అదృష్టమన్నావుగా" అన్నాడు రాజయ్యానవ్వుతో.

"అవునులే. కాని ఎంతగొడవఅంటావు. ఆనాటిప్రేమ నా జీవితం మీదనే ఓ మబ్బుని కమ్మేసింది."

"అదేమిటి ?"

"ఓటి చెప్పురాజయ్యా! సిగ్గుపడకు. నువ్వు ఏకపత్నీవ్రతుడవా ?"

"ఛా! ఏమాత్రంకాదు. ఎంతమాటన్నావు నన్ను."

"ఎవరిమీదనన్నా ప్రేమవొచ్చిందా ?"

"ఏమిటో! ఆ ప్రేమఅంటేనాకు సరిగా తెలీదోయ్. ఇష్టాలువొస్తాయి. అదేప్రేమేనేమో! ఎప్పుడూ తోటకూర పులుసుకూరతోనే తినగలవా ? చాపలు కావాలనిపించదూ ? అట్లా"

"అంటే నువ్వు ప్రేమనెరగవు. విశాలాక్షి నీకు జ్ఞాపకంవుందా బాగా యిప్పటికీ."

"ఊఁ" అన్నాడు రాజయ్య.

రాజయ్యలో విశాలాక్షిసంగతి మాట్లాడ్డానికి సరదాఏమీ కనిపించ లేదు శ్యామారావుకి. ఇన్నేళ్ళతరువాత ఆమెసంగతినెరిగి తనతో మాట్లాడ గలిగిన మిత్రుడు దొరికాడు. ఆ జ్ఞాపకం పైకివచ్చినకొద్దీ మాట్లాడాలని పొంగి పోతున్నాడు అతను. రాజయ్యకి ఇంకా ఆమెమీదకోపం పోనేలేదా, లేక ఆమెని మరిచిపోయి నాడా?"

"నేను ఏకపత్నీవ్రతుణ్ణి" అన్నాడు పైకి.

"ఎందుచేత ?"

"వ్రతం కాదనుకో. కాని విశాలాక్షి జ్ఞాపకం మూలాన ఇంక ఏ స్త్రీనీ తాకలేకపోయినాను. దాని అందం, మాటల వోడుపు - నీకేం తెలుసు అదంతా! కాలేజీలో చూడడం తప్ప దాన్నేం ఎరుగుదువు."

"ఎరగడం ఎందుకు ? దానికన్న అందమైనవాళ్లు ఎంతమందో!"

"అదే ప్రేమచేసే దుర్మార్గం, ఎంతో అందమైనవాళ్లు వుండవొచ్చు, కాని అందంగా కనపడరు."

తప్ప గతిలేనివాణ్ణి, యిట్లా చేతులారా గొంతు కోసుకున్నాను. నాచుట్టూ యెట్లా గంతులేశేవాడు! సముద్రం వలె పొంగి పొంగి నవ్వేవాడు. అయ్యో! యెట్లాబతకను వాణ్ణి యిట్లా చేసుకొని! యెట్లా చిక్కాడో? బుజాలదగ్గిర చిన్న బొమికలు కనబడుతున్నాయి.

ఒకరోజురాత్రి పార్థ చేతుల్లో అలిసి పడుకుని నిద్రబోతున్నప్పుడు, అబ్బాయి లేచి యేడ్చాడు. నిద్దట్లో లేచి కసురుకుని కొట్టబోయినాను. బుగ్గ నులిమాను. యేకలవొచ్చి యేడ్చాడో! అమ్మ తనని వొదిలిపెట్టిందని కల వొచ్చిందేమో! ఆనాడే! గొడ్రాల్ని! అబ్బాయిని వొదిలేశాను యిప్పుడింత తలుచుకొని యేడుస్తున్నాను. ఇంక యెన్నడూ అట్లా చెయ్యనని, రాత్రిలన్నీ తనకోసం మేలుకుంటానని, యెట్లాగన్నా అబ్బాయికి చెప్ప గలిగితే! ఒక్కసారి లేచి కళ్ళతో నన్ను చూసి పడుకోకూడదూ! అబ్బాయి చూస్తూవుండగా వాడి బుగ్గకి నెప్పి పుట్టించిన వేళ్ళని దీపంలో కాల్చాలనిపించింది. బుగ్గ యెర్రగా వుందిరా నాయినా మర్నాడు తెల్లారి! ఆ ప్రేమ ఆ గుండ్రని బుగ్గలేవి? ఆనవ్వు! ఆ మాపు, ఆదయ, యిప్పుడు నాకేదీ! యింక యీ లోకంలో!

మూడింటికి వెక్కిళ్ళు పుట్టాయి. పాలుపిండి పోశా. కళ్లు తెరచి చుట్టూ గుడ్లు ఒక్క సారి తిప్పి నా మొహంమీద ఆపి "అమ్మా" అన్నాడు. గుర్తు పట్టావా! అమ్మ-మళ్ళీ వొచ్చిందనుకున్నావా? నిన్ను విడిచి పోలే దనుకున్నావా? బాబూ మళ్ళీ ఒక్క సారి పెదిమలు కదిలించు. చేతులో యెత్తుకొని రొమ్ము కదుముకోవాలని యెంతో అనిపించింది. అంతే గుడ్లు తిరిగిపోయినాయి. వూపిరాగింది. అంతే. అంతే. అరిచి కింద పడ్డాను. "బాబూ యేమైనావు? యెక్కడికి వెళ్ళావు?"

"అమ్మమీద కోపమే! వెళ్ళిపోయిందని అమ్మ నిన్ను వొదిలివేసిందని, జాలిపడి దేవుడు పిలిస్తే వెళ్ళావా? భూమిమీద నాకు దిక్కే లేక పోయిందా? యింక యెన్నడూ వొదలను. వొక్కసారి రావూ? రావూ? నిర్భాగ్యురాలిని నా దగ్గిర నువ్వెందుకుంటావు?

వెనకాల యెవరో చెయ్యి వేశారు. తిరిగి చూశాను.

పార్థా! పార్థా! మన అబ్బాయి!

"మరి భార్య!"

"భార్య వేరు. భార్యని ప్రేమించడమూ- అదీ పశ్చిమదేశ వ్యవహారం. మనకి ప్రేమతో నిమిత్తంలేదు. ధర్మం. ఇష్టంకూడా అవసరంలేదు. మామూలు రొటీన్ వ్యవహారం. కాని ఒక్కసారి గట్టిగా ప్రేమించామా ఇంక మళ్ళీ ఎవరినీ తక్కువవారిని ఇష్టపడలేము. విశాలాక్షి నాజీవితాన్నట్లా చేసేసింది. ఒక స్త్రీ వ్యవహారంలోనేకాదు. జీవితంమీది ఆసక్తినే చంపేసింది నాలో."

"అదేమిటి?"

"అవును ఆమెలేనిది ఎందుకు జీవించడం? ఏ సౌఖ్యమన్నా ఏ అదృష్ట మన్నా ఆమె పంచుకోనిది వ్యర్థం అనిపించింది ఇన్నేళ్ళూ."

"అంత లోతుగా వుంటుందన్నమాట ప్రేమఅంటే! ఎన్నేళ్ళకింద నాటి సంగతి!" అని నవ్వాడు రాజయ్య.

"నీకర్థం కాదులే. ఆమె జ్ఞాపకమే లేకపోతే ఇంకా ఉత్సాహంగా, పట్టుగా ఉద్యోగం చేసి వుందును. ఎన్నేళ్లకీ ఈ లెక్చరరుగానే వుండిపోదు ననుకున్నావా?"

"ఇన్నేళ్లల్లోనూ మధ్య మధ్య ఓసారి ఆమె ఎదిగి ఎట్లా తయారవు తోందో చూస్తే చాలావరకు కుదిరిపోయేదేమో నీ ప్రేమ పిచ్చి!"

"చూస్తేనేం?"

"ఇన్నేళ్లతరవాత ఇంకా ఆమె రూపం జ్ఞాపకముందా నీకు? ఉంటే ఇంకా పద్దెనిమిదేళ్ల బాలాకుమార్తెగానే చిత్రించుకుంటూ వుండివుంటావు దాన్ని అవునా?"

"సరిగా చెప్పావు. అవును చిత్రంగా ఈనాటికీ ఆమె ఆనాటిరూపం నవ్వుతో, సూటిగా కళ్లలోకి చూస్తూ అట్లానే వుండిపోయింది. ఈ రోజు ఆమెని గుర్తుపట్టగలను, ఆ రూపంలోనే ఆమె కనపడితే."

"ఆరూపం ఆధారమే గాని, అసలు నీకు జ్ఞాపకమున్నదల్లా నీ ప్రేమే ననుకుంటా."

"అదీ చిత్రమే కదా! ఆలోచిస్తే నేనేమనుకుంటానంటే, మాసంబంధం ఈజన్మదికాదేమో, ఎన్నిజన్మలనించో ఇట్లా కలుసుకుంటూ విడివడతోనే ఉన్నానేమోనని."

"పునర్జన్మలూ అవీ నమ్మకమా ఏమిటినీకు?"

"కాదా? నీకులేదా? జన్మలు లేవంటావా? లేకపోతే చచ్చింతరవాత ఏమౌతామంటావు?"

"నేనేం ఆలోచించలేదనుకో. కాని ఏమిటో మళ్ళీమళ్ళీ పుట్టడం, మనుషులు, కుక్కలూ, పిల్లులూ కావడమూ అదీ చాలా మూఢనమ్మకంగా కనపడుతుంది."

"నాకట్లా అనిపించదు."

"నువ్వు వృథాగా ఏదో వూహించుకుని, నీ జీవితమంతా చెడకొట్టుకున్నావు. ఆమె నీనించి ఇంతత్యాగానికి అర్హురాలని ఎందుకు అనుకున్నావు? తక్కిన స్త్రీలవంటి స్త్రీ. కొంచెం పెద్దకళ్ళూ, పెద్దరొమ్మూ వుండగానే, ఆమె ఏదో లలనాశిరోమణి అని ఓ ఆలయం కట్టుకున్నావు నీ హృదయంలో. అసలు నువ్వేంఎరుగుదువు ఇంతకీ" అని దూకుడుగా లేచాడు రాజయ్య. "కోర్టుల్లో ఇట్లాంటివి ఎన్ని ? ఈ లేచిపోయినవాళ్ళ కేసుల్లో వాళ్ళు మొదట్లో రాసుకున్న ఉత్తరాలలో ఆరాధనా, కోర్టుకెక్కిననాడు బైటపడే వాస్తవమూ, ఆ ప్రియులు ఒకరినొకరు తిట్టుకునే విధమూ వినాలి నువ్వు" అని ముగించాడు.

"సాధారణులలో నువ్వనేది నిజంకావొచ్చు. ఆమెలో ఏదన్నా గట్టి లోపం వుంటే నావంటివాడి మనసు ఆమెలో ఇన్నేళ్లు అట్లా కాదనుకో."

"దుష్యంతుడిమల్లే మాట్లాడకు. ఈ కావ్యాలు చదవడంవల్ల వొచ్చిన ముదనష్టమేఅది. ఆనాడు వీరకార్యదక్షుడు డాన్క్విక్సాట్ ఒకడేకాని, యీనాడు ప్రేమకావ్యాలు చదివి తాము మానవాతీత శృంగారమూర్తులమని మోసపోయే ప్రేమ క్విక్సాట్లు వందలు. వాళ్ళల్లో నువ్వొకడు. ఇంతగా ఇట్లా అయినావనుకోలేదు ఇన్నేళ్లూ. ఈ సంగతే తెలిస్తే ఎప్పుడో నిన్ను యీ మాయనించి తప్పించేవాణ్ణి."

"ఎట్లా"

"ఈనాటికీ అట్లానే ఉన్నావా ?"

"ఊఁ. ఈజన్మకేకాదు ఏజన్మకైనా ఇంతే."

"విచిత్రం. నువ్వు దాంతో ఓ ఆర్నెల్లు కాపరంచేస్తే కుదిరిపోను ఈ పిచ్చి."

"మామూలు స్త్రీలతో అంతేననుకో. ఆమెతో కాదు. అనేకఏళ్ళు ప్రేమ ప్రజ్వలంగా వెలిగిన దాంపత్యాలు లేవంటావా ?"

"నిస్సంశయంగాలేవు. ఒక్కటిచూపించు. ఎంతకీ ఏకావ్యాలూ పెళ్ళిఅయినదాకానే. తరవాత ఏముంది ?"

"సీతారాములు."

"ఏం? మనకేం తెలుసు? అడివికి పంపించినప్పటి ఏడుపులు తప్ప. ఏ మొగుడైనా ఆ సందర్భంలో అట్లానే ఏడుస్తాడు. కవిగనక ఆ రాసిన వాడు అందంగా ఏడిపించాడు. పైగా అన్యాయం చేస్తున్నానని తెలుసు కూడాను శ్రీరాముడికి! ఒకవేళ విశాలాక్షి వ్యభిచారి అని తెలుసుననుకో నీకు - ఇంకా నీచమైన గుణాలున్నాయనుకో - ఈ వ్యామోహం అట్లానే వుండేదా?"

"తరువాత జీవితం సంగతి నాకు తెలీనూ తెలీదు అఖ్ఖర్లా లేదు. కాని ఆరోజుల్లో ఆమె దివ్యమూర్తిలో కళంకం ఎక్కడాలేదు.

"నీకెట్లా తెలుసు?"

"నువ్వు వృత్తసినిక్‌వి. అట్లా సినిక్ ఐపోవడంకన్న, నామల్లే విరహంలో కాలిపోవడమే వుత్తమం," అన్నాడు చాలాతృణీకారంతో శ్యామారావు.

రాజయ్య మాట్లాడలేదు. అతనికీ కోపం హెచ్చుతున్నట్టుంది.

"ఏమంటావు? మాట్లాడవేం?"

"అభిరుచుల్లో భేదం. పోనీ; అట్లా అనుకో".

"నీ నోరు మూస్తాను. ఈ సంగతివిను మా పెద్దమ్మాయి బాల్యంలోనే వితంతువయింది. చిన్నప్పటినించీ బళ్ళో చదువుకుంటోనే వుంది. దాన్నే 'కంటిన్యూ' చేసింది. కాలేజీలో ఇంకా ఆడపిల్లలు వుండేవాళ్లుగా! వాళ్లల్లో రమ అనే పిల్లమీద దానికి ఏమిటో చెప్పలేని ఇష్టం. ఆ పిల్లని చూడకుండా ఒక్కరోజు వుండలేకపోయేది. ఎప్పుడూ ఆపిల్ల కబుర్లే. ఆపిల్ల 'హిస్టరీ' శాఖ. అందుకని నేను చూడడం తటస్థించలేదు. ఆ రమా అంతే. మా అమ్మాయిని చూడకుండా నిలవలేదు. దూరాన్నించి చూసే ఒకరినొకరు అంత ప్రేమించారట. అమ్మాయికి జరంవొచ్చినప్పుడు చూడ్డానికి వచ్చింది మా యింటికి రమ. ఆమెని చూడ్డంతోనే నాకూ ఎక్కడలేని ఆకర్షణా కలిగింది. ఆమెకూ నామీద అంతే. దాన్ని చూడంది, దాంతో మాట్లాడంది ఒక్కరోజు ఉండలేకపోయేవాణ్ని. వొచ్చి చాలా చనువుగా నాపక్కన కూచునేది. మొదట్నించీ నాకు ఆమె మీద తెలీకండానే కొంత మోహం వుంది. నావయసెక్కడ దానివయసెక్కడ. పైకిమాత్రం మా అమ్మాయి మీద వుండే ఇష్టంలాగే వుండేది. కాని ఎక్కడో భేదం - ఒకటే తాకాలని, బుజ్జగించాలని, ప్రెజెంట్లు ఇచ్చి సంతోషపెట్టాలనిపించింది. ఏదో

మాటల సందర్భంలో చెప్పింది. తన తల్లిపేరు విశాలాక్షి అని. తీరా చూస్తే ఆమె మన విశాలాక్షే! ఏమంటావు?"

చప్పున పైకిలేచి కూచుని శ్రద్ధగావింటున్నాడు రాజయ్య "తరువాత?"

"తరువాత చెప్పాలంటే అది ఎట్లా చెప్పాలో తెలీటంలేదు. ఇదే నా నోటనించి రావడం ఆ సంగతి. సిగ్గుగావుంది. అంతేకాదు. చాలా అందమైనదీ, గాఢమైనదీ - మాటలతో ఇతరులతో చెబితే - చాలాసార్లు ఆ చెప్పడంలోనే - వాళ్లు వినడంతోనే మురికి ఐపోతుంది. కాని నువ్వువేరు. విను రమ మా ఇంటో బాగా అలవాటయింది: చాలా రోజులు మా ఇంటోనే వుండిపోయేది. మా ఇంటో కాలేజీ ఆడపిల్లలు తరుచూ వుండే వారు. తలిదండ్రులకీ, కాలేజీవారికీ నాపైని చాలా విశ్వాసం-సునిశితమైన ఋజుప్రవర్తన నాది అని"

"ఎందుకు ఆవిశ్వాసం?" అన్నాడు నవ్వుతో రాజయ్య.

"ఏమో!"

"వయసు వల్లనేమో!"

"కాదు చిన్నప్పటినించీ అంతే."

"నీ మొహంలోనే వుందనుకుంటా."

"కావొచ్చు. అదిగాక అప్పుడప్పుడు నియమాల్నిగురించీ, పవిత్రతా, సంస్కరణా ఇట్లాంటివాటినిగురించి, విద్యార్థులకేగాక, కొంచెం పబ్లిక్‌లో కూడా మాట్లాడేవాడిని. ఇంక వేరేవాడు ఏమీరాకపోతే, ఆమాట్లాడడం ఎంత ఉపకరిస్తుందని!"

"అవును. అందులో అవినీతి ఎటో చాలాదూరాన నీచుల్లోవుండేట్టూ, మనకి ఎక్కడో వినికిడేగాని, ఏమీ తెలిసిన వ్యవహారం కానట్టూ మాట్లాడితే చాలు. నీతికీ, character కీ, శీలానికీ ప్రసిద్ధికెక్కిన వాళ్ళంతా అట్లా మాట్లాడడంవల్లనే ఆకీర్తి సంపాయించారు. అసలు వ్యవహారానికీ ఈకీర్తికీ ఏమీ సంబంధంలేదు. ఇట్లా గొప్పకీర్తి సంపాయించుకున్నవారి చరిత్రలు మరణంతరవాత అద్భుతంగా బైటపడి, ప్రజలని అన్నేళ్ళు ఎంతబాగా వంచించారో చూపిస్తాయి. Gladstone సంగతి తలుచుకో. సరే నీకథ కానీ."

"రమ మాయింట్లోనే వుండేది. మాకు స్నేహం ఎక్కువయింది. ఒక రోజున నా వొళ్ళోకూచుని, నా మెడచుట్టూ చేతులువేసి ఏదోమాట్లాడుతోంది."

రాజయ్య తలనిచేతుల్లోపెట్టుకుని మూలిగినట్టు వినిపించి ఆగాడు.

"ఏమిటీ ది."

"ఏంలేదే. కానీ"

కాని కంఠంలో ఏదో కలవరం.

"ఎట్లా చెప్పను? ఆమె చిన్న రొమ్ము నా రొమ్ముకి ఆనుకుంది. కావలిసే ఆనించిందా అని......"

"ఛఛ్. అట్లాంటిదికాదు ఆ పిల్ల."

"ఏ పిల్ల"

"ఏంలేదులే కానీ"

"ఏమిటి నువ్వా రమనెరుగుదువా ?"

"నాకు తెలీదు ఆరమ ఎవరో! ఏమీ ఎరగని ఆడపిల్లని పట్టుకుని అట్లాంటి వుద్దేశ్యం వుందని నువ్వు ఆరోపిస్తే, నాకు కోపమొచ్చింది."

"కాదులే. నువ్వెరుగుదువు. వొప్పుకో."

"ముందు నీకథ కానీ."

"నేనేమీ ఆరోపించలేదు. నా అనుమానం నిజమని తేలింది. ఈ ఆడపిల్లలకి టీచర్లనీ, లెక్చరర్లనీ చూస్తే ఎంత ఆరాధన! దాన్ని చాలాసులభం, ఇష్టమైన తోవలోకి తిప్పుకోడం. అందుకనే university commission లో ఆడపిల్లలకి ఆడ లెక్చరర్లే వుండాలని వాదించాను."

"సరేలే అదంతా. ఏంజరిగింది అప్పుడు ? ఏంచేశావు రమని ?"

చాలా దూకుడుగా మాట్లాడాడు రాజయ్య.

"ఏమిటి సంగతి ? నేనుచెప్పను. ముందు నీ interest ఏమిటోచెప్పు"

"చెపుతా తరువాత"

"నిజమేనా ?"

"ఊ"

"నా వొళ్ళు ఏమయిందంటావు ?"

"రమమీద నేనా నీకంత యిష్టం ? కాక విశాలాక్షి కూతురనా ?"

"అప్పుడు నాకు రమ విశాలాక్షి కూతురని తెలీదు"

"ఎప్పుడు తెలిసింది."

"తరువాత ఎప్పుడో చెపుతాలే. ఏంచెపుతున్నాను ?"

"ఏమైనావు అప్పుడు ? "

"ఏమైనాను ? ఆ పరిస్థితిలో మొగవాడు ఏమౌతాడో అదేఐనాను"

"ఐ ?"

"ఏ ఏంలేదు. మెల్లిగా ఆ పిల్ల చేతులు నానించి తీసేసి తప్పించు కుని కబుర్లుచెప్పి పంపాను. కాని నా దేహమంతా ఆమెవేపు లాగింది"

"ఇంకేం ?"

"కాని నా వయసెక్కడ? ఆపిల్ల వయసెక్కడ ?"

"వయసుతో పనేమిటి? ఏమన్నా పెళ్ళిచేసుకుంటున్నావా రమని?"

"దేనికైనానూ. నా ఆనర్: పాపం నన్ను నమ్మిన పిల్లని, ఏదో బల హీనమైన సమయంలో ఎడ్వాన్టేజ్ తీసుకోడం..."

"ఆకబుర్లకేం? ఏంచేశావో చెపుదూ ?"

"ఏం చెయ్యలేదు.

రాజయ్య నిట్టూర్పు విడిచి కుర్చీలోకి వొంగాడు. శ్యామారావు అది చూడలేదు. పూర్తిగా గతంలో నిమగ్నుడై రాజయ్యనే మరిచిపోయినాడు.

"తరువాత అంతా మిగిలినరోజులన్నీ రమతో వొంటరిగా వుండకండా తప్పించుకున్నాను"

"అయిపోయిందా ?"

"లేదు విను. శలవలకి రమ వాళ్లవూరు వెళ్ళినప్పుడు తెలిసింది నాకు మొదట ఆమెమీద చాలా ప్రేమ అని. అందులో అది చాలా ఉన్నతమైన ప్రేమ అని."

"ఏమిటి? ఆ ప్రేమ ఏమిటి? అందులో ఉన్నతమైన ప్రేమ ఏమిటి? అంటే ప్రేమకీ, ఉన్నతప్రేమకీ, పవిత్రప్రేమకీ వీటన్నిటికీ ఒకటేగా అర్థం ?"

"ఏం అర్థం ?"

"ఏముంది? అంతా ఒకటే వాంఛ. భేదమల్లా బట్టలన్నిటితోనూ, కొన్నిటితోనూ, అసలు లేకుండానూ. అంతే పవిత్రప్రేమకీ పశుకామానికీ భేధం" అని నవ్వాడు నిష్కల్మషంగా.

"వూరికే వెక్కిరించకు సినిక్, నీకేం తెలీదు యీ విషయం. నీ అను భవమంతా పచ్చి భోగంవాళ్లతోమల్లే వుంది. ప్రేమఅంటే-అసలు ఆ పడక సంగతులు ఏమీజ్ఞాపకంరావు. ఆ పిల్ల వూరికే నీతో వుంటేచాలుననిపిస్తుంది. తెలిసిందా ఇప్పటికన్నా."

"తెలుసులేవోయ్. అవన్నీ కవిత్వం రాసే కుర్రకుంకల మాటలు. చేతికి అందనప్పుడూ, ఏవో అభ్యంతరాలున్నప్పుడూ అట్లాంటి వెర్రి కలల లోకి పోక అంతకన్న ఏంచేస్తాడు మనిషి? ఇద్దరు ప్రియులూ కలిశాక,

మూడో మనిషి లేకండా ఇంతవరకు కవిత్వంగాని కథగాని వొచ్చిందా ? అంతే మొదట్లో తనకి కనపడితే చాలునంటాడు. తరవాత తనవంక చూస్తే చాలు-తరవాత వేలు తగిలితే చాలు, తరవాత చెయ్యి తనమీద వేయిస్తేచాలు, తరవాత తనచేతిని మీద వేయించుకుంటేచాలు - ఇంకా ఆ చెయ్యిని జరపనిస్తే చాలు, దగ్గరిగా పడుకుని ఆకాశంవంక చూస్తే చాలు - తక్కిన Steps యోచించుకో. ఆ కొనన ప్రారంభించి, కాలమూ వీలూ దొరికితే, ఈచివరికి రాని మనిషిని చూపించు. వాణ్ణి బుజాలమీద కూచోపెట్టుకుని దేశమంతా తిరుగుతాను."

"వీడూ. బుజాలమీద ఎక్కించుకో."

"కథంతా చెప్పు ముందు. తరవాత ఎక్కించుకుంటాను, నువ్వు అంత గొప్పవాడివని రూఢిఐనతరువాత."

"నువ్వట్లా ఎక్కిరిస్తోవుంటే చెప్పాలని బుద్ధివెయ్యటంలేదు."

"చూపిస్తాను. బుజాలమీద ఎక్కించుకో."

"ఎవడు ?"

"వీడూ"

"నువ్వా. నువ్వంత గొప్పవాడివని రూఢిఐనప్పుడు అట్లానే ఎక్కించుకుంటాను. నువ్వుగాని ఎవరుగాని నేను చెప్పిందానికి విరుద్ధంకాదు. ముందు బట్టలన్నిటితోనూ కనబడితేచాలు. తరవాత ? ఒక్కొక్కటే కొంచెంగా తొలిగి విలులేనప్పుడు ఎక్కడెక్కడ సందుకనపడితే దాంట్లోంచి, మెల్లిగా ఒక్కొక్కటేతీసి, చివరికి ఏమీలేకండా అక్కడితో ఆఖరు. ఇంక వెనక్కి తిరుగుతాడు. ఒక్కొక్కటే కప్పడం ప్రారంభిస్తాడు. తరవాత అసలు చూడనేచూడడు. దీపం ఆర్పుతోవుంటాడు. భార్య విషయమై ఈ steps అన్నీ ఒక్క రాత్రిలోనే జరుగుతాయి గనక, రొమాన్సు చాల తొందరలో ముగుస్తుంది. తక్కినవాళ్ళతో కొంత ఆలస్యం. అంతేనాకాదా ? కానీ నీ కథ."

"నువ్వట్లా వెక్కిరిస్తోవుంటే చెప్పాలనిపించటంలేదు."

"అవును. ఎందుకంటే సహజమైన కామం, మనిషి దేహంలో చాలా కిందిభాగంలోవుంటుంది. దానికి సిగ్గులేదు, వెక్కిరింపులుగాని, భయాలుగాని అపనిందలుకాని, దాన్ని ఆపలేవు కదల్చలేవు. నీవంటివాళ్ళల్లోనూ, కవుల్లోనూ అది క్రమంగా తల్లోకి ఎక్కుతుంది. దాని విషం కళ్ళల్లోకిదిగి స్త్రీలలోనేవి

అందాన్ని కల్పిస్తుంది. ఈ తలలోని కామానికి సిగ్గు, అది అబద్ధం అసహజం కనక వెక్కిరింపుకి తట్టుకోలేదు."

"లారెన్సు పుస్తకంలోమల్లే మాట్లాడుతున్నావు."

"ఎవరి పుస్తకంలోదికానీ నిజం. కానీ నీకథ. నవ్వనులే"

"రమకి ఉత్తరం రాశాను ఆమెలేనిదే ఉండలేననీ, త్వరగా రమ్మని. ఏమనుకుంటుంది అనే యోచనకూడా లేకండానే. రెండురోజుల్లో వొచ్చింది. ఓ తెల్లారకట్ట సరాసరి నా పక్కదగ్గిరికివొచ్చి, కలలోమల్లే నిద్రపొయ్యే నా చెంపమీద చెయ్యేసింది. కళ్ళుతెరిస్తే నవ్వుతో రమ. నాకు ఇంకానిద్ర. ఆమెచేతులు పట్టుకున్నాను......ఎందుకు నవ్వుతున్నావు ?"

"తక్కింది నేనుచెప్పనా ? నీ పవిత్రప్రేమ ఏంచేసిందో !"

"వుండు" శ్యామారావు తన కళ్ళఎదటికి పిలుచుకుంటున్న దృశ్యంలో లీనమైనాడు.

"ఆమె నామీదికి వొరిగింది. దగ్గరికి తీసుకున్నాను. ఏ స్టేజీలోనన్నా ఆమె అభ్యంతరం కనపరచాలని నా ఆశ......"

"నీభయం"

"కాదు. నిశ్చయంగాకాదు."

"అవునులే రెండూకలిసేవుంటాయి. ఆమెశీలం నీ శీలాన్ని రక్షించాలని. అట్లాకాదా, చివరికి నింద కొంతవరకన్నా ఆమెమీద వెయ్యవచ్చు. అట్లాంటప్పుడు మగవాడు అంతకన్న ఏంచేస్తాడని !"

"కాదు. విను ఆమెకళ్లు మూతలుపడ్డాయి. ఇంకా నాదగ్గిరిగా వొత్తుకుంటోంది. నేను నవ్వుతో, ఆటమల్లే, ఆమె జాకెట్టుగుండీల్ని విప్పుతున్నాను. ఎండపడని, గాలికూడా గట్టిగాతగలని ఆమె రొమ్ముకంగు నా తలతిప్పింది. తరవాత......"

"ఎందుకు ఆగావు ?"

"ఏంలేదు. నువ్వు చెప్పిన steps అన్నీ వరసగా..." అని నవ్వాడు సిగ్గుగా.

రాజయ్య బిగ్గిరిగా నవ్వాడు.

"ఏమిటోయ్ ఆ సిగ్గు! మామూలు seductionన్ని ఏదో మహా యజ్ఞంలాగు, ఏదో అపురూప కళ్యాణ మహోత్సవం లాగు మాట్లాడుతున్నావు ? ఎవరూ ఎరగనిదీ, నీకే ఎట్లానో జరిగిన విషయంలాగూ ? ఏమన్నా చలం గాలి సోకిందా ఏం ?"

"సరేలే. ఆమె ఉద్దేశ్యం తెలుస్తోంది. చివర-అంటే —"

"తెలిసిందిలే"

"ఆగాను. ఎందుకు ఆగానా అని కళ్లు తెరిచింది. అప్పుడు తట్టింది నేను చేస్తున్న ఘోరపాపం నామనసుకి. చప్పున మంచంమీదనించి లేచి నుంచున్నాను"

చాలాtension తో వింటున్న రాజయ్య తెప్పరిల్లాడు. Relief తో నిట్టూర్పు విడిచాడు.

"దీనికా నేను నిన్ను బుజాలమీద మొయ్యవలసింది ? నీ బుజాలు నే నెక్కడానికి కూడా పనికిరావు. పాపం ! ఎంత నీచమైనపని చేశావు ? ఏమై వుంటుంది ఆపిల్ల ! ఆ మర్నాడే నిన్ను వదిలి వెళ్లిపోయింది కాదూ ?"

"అవును నీకెట్లా తెలిసింది ?"

"అంతకన్న ఏంచేస్తుంది ?"

"నీచమైన పని చేశానంటావా ?

"వేరే అడుగుతావా?"

ఇన్నేళ్లూ చాలా ఘనమైనకార్యం - గొప్ప ఉదారత్వంతో - నన్ను నేను నిరాకరించుకున్నాననుకుంటున్నాను. అదే నిజమేమో ? ఆ నిమిషాన ఆమెని గాయపరిచాను. తరవాత రమ నా మొహం చూడలేకపోయింది. కాని నాకే ఆ నిగ్రహశక్తి ఆ నిమిషాన రాకపోతే ఆ పిల్లగతి ఏమయ్యేది?"

"ఏమయ్యేదో ! కాని ఇప్పుడేమయింది ?"

"ఏమయింది ?"

"ఏమయిందో నీకెందుకు ? నీ నిగ్రహం నీకేగాని !"

"ఏదో నీ కామం నీకేగాని ఆ పిల్ల గర్భవతిఐతే నీకేం ? అన్నట్టు మాట్లాడుతున్నావే !"

"అవును. నీతి అవినీతులే చూస్తారుగాని, నీతిపేర ఎంత స్వార్థం చలామణి అవుతోందో ఎవరికి తెలుసు ? నువ్వు ఆపిల్ల జీవితాన్ని రక్షించ గలిగానని, ఎంతో నిగ్రహం చూపానని గర్వంగా• నీ బుజాలమీద నువ్వు తట్టుకుంటున్నావు. ఇన్నేళ్ళూ అంత మానవాతీతుణ్ణి నేనే కదా ? ఇంకోరు అంత స్వార్థరహితులు వుంటారా అని ? బహుశా ఈశ్వరుడుకూడా నిన్ను గౌరవిస్తాడనే. కాని నిన్ను నువ్వు రక్షించుకున్నావు. ఆ వొక్క పనీ చివరిదాకా జరిగితే, దాంతో నీకూ ఆ పిల్లకూ లంకెపడేది. వొదలలేవు.

నేరం చేశాననే బాధ. ఈ పిల్ల భవిష్యత్తు బాధ్యత. వొదుల్చుకుంటే ఆ నేర భారం ఉత్త స్వార్థపరుడిది. ఆపని చెయ్యనందుకు నీది మహా పవిత్రప్రేమ."

"సరేలే. నావయసు, ఆపిల్లవయసు, పెళ్ళికాని పిల్ల. నేను స్వార్థ పరుణ్ణి అని నన్ను అన్యాయంగా..."

"తిరిగి ఆ అమ్మాయిని నువ్వు కలుసుకున్నావా ?"

"పెళ్ళయినాక ఓ కూతురు పుట్టాక. ఓసారి ఆమె భర్తా, ఆమే, రైల్లో కలుసుకున్నాము. నేను గట్టిగా అడిగితే ప్రయాణం మధ్యలో ఆగి మా ఇంట్లో ఓరోజు ఉన్నారు."

"ఎట్లా కనపడ్డది ?"

"మామూలుగానే. ఎదిగింది. ఏదో శాంతంగా వుంది.

"అంతేలే. అంతకన్న ఏం తెలుసుకోగలవు ? తాము ఉత్తములు అనుకునే మనుషులంత గుడ్డివాళ్ళూ స్వార్థపరులూ వుండరు."

"సరేలే. ఆమెకేం అపకారం జరిగింది ? సుఖంగా పెళ్ళి చేసుకుంది తనకి ఈడువాణ్ణి. పిల్లల్ని కన్నది."

"అట్లానే సమర్థించుకుంటారు."

"నాతో ఆమె బతుకేమిటి ?"

"ఆమెతో నీ బతుకేమిటి ? అది ఎత్తవేం ?"

"అవును ఘోరమే. కాని ఆమెని రక్షించానా లేదా !"

"అవును, ఓ విధంగా రక్షించావు. నిన్ను రక్షించుకుని. కాని ఇంకో విధంగా నీకూ ప్రపంచానికీ కనపడని విధాన......"

"నీకెట్లా తెలుసు ?"

"చెపుతా తరవాత. అక్కడితో ఆమెచదువు ఆఖరు. ఆ దెబ్బతో ఇంకోమొగాడిచేతుల్లో పడ్డది. ఆ అనుభవంతో నిర్బంధపు అవసరపుపెళ్ళి. ఆ సంసారం వుత్త నిస్సారమయింది. దీనికంతా మొదటికారణం గడ్డకట్టి పేరుకున్న నీ స్వార్థం."

"నాదా ? రెండోదీ !"

"నా పశుత్వం"

"నీదా !"

"అవును. నీనించి సరాసరి రమ నాదగ్గరికి వొచ్చింది."

"నీదగ్గిరికా ! నువ్వేం తెలుసు ?"

"తరవాత చెపుతా"

"ఈ సంగతంతా చెప్పకుండా ?"

"లేదు. కాని అట్లాంటిదేదో జరిగిందనుకున్నాను. ఎవరో కాలేజీ కుర్రాడితోననుకున్నాను. గౌరవనీయుడూ వయోవృద్ధుడైన లెక్చరర్‌తో ననుకోలేదు. నిన్నామె ఎరుగుననికూడా తెలీలేదు నాకు యీనాటివరకు."

"ఎట్లా తెలిసిందినీకు ఆమె హృదయంలో దెబ్బతిన్నదని ?"

"అనుభవం"

"ఏం చేశావు ?"

"ఏంచేస్తాడు మొగాడు ? నేనాస్థానం ఆక్రమించుకున్నాను"

"పశువా !"

"అదేగా నా పశుత్వం అన్నాను !"

"దాంతో ఆమె భవిష్యత్తునే మాడ్చేశావా ?"

"ఎవరి భవిష్యత్తుని ఎవరూ మాడ్చరు. ఆమాటకొస్తే నీదే ఎక్కువ బాధ్యత."

"ఈ వ్యవహారాల్లో ఎవరో ఒకరో, లేక ఇద్దరో దెబ్బతినాలి తప్పదుగావును. నువ్వు తప్పించుకున్నావు. ఆమె నాశనమయింది."

"ఎంత ఉన్నతంగా బిట్టర్‌గా మాట్లాడుతున్నా ? ఈ idialists తో వొచ్చిన ప్రారబ్ధమేఅది. ఏ hard facts మాట్లాడినాసరే, వాస్తవాన్ని భరించే మనోశక్తిలేక, వెంటనే అసలు ఎక్కడాలేని, ఏవో Generalisations లోకివెళ్ళి, ప్రపంచమే ఆ సూత్రాలమీద నడుస్తోందని, నాయకప్పకుంటారు. ఎవరు జీవితంలో గాయపడేది ? గాయపడడానికి సిద్ధంగా, గాయపడే మనసుల్ని పోషించుకున్న వాళ్ళు, జాగ్రత్తపడని లేతయువకులూ యువతులూ. నేనేమీ నష్టపడలేదు."

"అవును, మొగాడికి నీకేం !"

"మరి మొగాడికి నీకేమయింది ? "

"నాకో అంతరాత్మ వుంది"

"అంతరాత్మ అని గర్వంగా చెప్పకోకు. అంతరాత్మఅంటే అర్థం ఏదో ఒక వంక పెట్టుకుని ఏడ్చి, ఆ ఏడుపుని చూసుకుని తక్కినవారికన్న అధికుల మని, నీతిపరులమని నిబ్బరపడడం"

"నష్టపడ్డవాళ్ళందరూ అంతరాత్మలవల్లనేనా నష్టపడేది ?"

"దానికి బుద్ధితక్కువతనం తోడ్పడిందంటే పూర్తిగా అణగారి పోతారు. మా ఊళ్ళో ఓ డాక్టరు వున్నాడు. యువకుడు, సమర్థుడు,

చాలా మంచి ప్రాక్టీసు అందుకుంది ఆర్నెల్లల్లో. ఓ ప్లీడరు భార్యని ట్రీట్ చేస్తో, ఆమె ఆకర్షణకి తాళలేక లొంగాడు. అంతే. పదేళ్ళయింది ఈ నాటికి మళ్ళీ తలెత్తుకోలేదు. ఎందుకు? అంతరాత్మ ప్రాక్టీసు పోతుందని భయం, అన్నిటికన్న అజాగ్రత్త, అబద్ధం చాతకాకపోవడం"

"వ్యభిచారానికి మోసం తోడ్పడాలంటావు."

"ఆ పేర్లు వొప్పుకోను. వ్యభిచారం కాదు. దాన్నే ఉజ్వలమైన ప్రేమ అని చలంమల్లే అంటే కవులూ కాముకులూ కూడా క్షమిస్తారు. మోసం కాదు. వృత్తి వివేకమను. ఎందుకులే ఈ వాదన! ఈనాడు ఇంక నువ్వు నానించి నేర్చుకునేదీలేదు. నేను నీనించి నేర్చుకునేదీలేదు.

"అవును" అని నవ్వాడు శ్యామారావు. నవ్వి "రమ ఏమయిందిచెప్పు" అన్నాడు.

"మాయింటికి వొచ్చింది అన్నాను కదూ! ఏమీ మాట్లాడకండా కూచునేది. నీకుమల్లేనే నాకు ఆమెమీద చాలా గొప్ప ఇష్టం"

"నాకుమల్లేనే అంటావేమిటి?"

"విశాలాక్షి కూతురుగనక"

"ఐతే నీకెందుకు మధ్య"

ఆపుకోలేక నవ్వాడు రాజయ్య రెండునిమిషాలసేపు. శ్యామారావు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. ఆ రాత్రి వాళ్ళిద్దరూ జీవితపు చివరికి జరిగిన వృద్ధులుకారు. మళ్ళీ గడిచిన కాలాన్ని జీవిస్తూన్న యువకులైనారు.

"ఇందాకణ్నించి ఏం మాట్లాడావు? మాటలకీ, తాము నిజంగా నమ్ముతున్నామనుకున్న అభిప్రాయాలకీ, మనసులోని అసలు విలవలకీ ఎంతెంత వ్యత్యాసాలు? నీకేనా విశాలాక్షిమీద ప్రేమ? నాకు వుండకూడదా? ఎందుకూ? ఆమెతో నువ్వు చాలాసార్లు మాట్లాడావు, పద్యాలు రాశావు, ఆమెని జ్ఞాపకముంచుకున్నాననుకున్నావు, ఆమెవల్ల జీవితం పాడయిందనుకుని తృప్తిపడ్డావు. అన్నిటికన్నా ఆ చివరి విషయంవల్ల ఆమె నీ స్వంతమయింది. ఆమె భర్తకన్న, పిల్లలకన్న, ప్రియులకన్న, నీకే సన్నిహితురాలు ఆమె"

"ప్రియులేమిటి?

"ఏం? ప్రియులు వుండరా? వుండకూడదా?

"తెలీందే ఎందుకా అపనింద ఆ పవిత్ర..."

"ప్రియులున్నారంటే అపనిందా? ఎట్లామాట్లాడనోయ్ నీతో! ఆమె ప్రియుడు కావడానికి నీకు అభ్యంతరం లేదుగాని, ఆమెకి ప్రియులున్నారంటే స్త్రీమీద గౌరవానికే కళంకమా? అంత ఆకర్షణగల స్త్రీ ప్రియులు లేకండానే అట్లాంటిభర్తతో కాపరంచేసిందనడంకన్న ఆమెకి ఇంకేం అపకీర్తి కావాలి?"

"అట్లాంటి భర్తేమిటి? నువ్వెరుగుదువా ఏమిటి?"

"ఎరగకేం?"

"ఎట్లా?"

"నువ్వు చెప్పనిస్తేనా?"

"చెప్పు!"

"అసలు..."

"రమసంగతి కానేలేదు. అదిచెప్పుముందు"

"అవును. రమమీద నాకిష్టమన్నాను కాదూ? ముందు ఆమెని చదువు ముగించమని గట్టిగా సలహాయిచ్చాను."

"ఆమెకి ఇల్లూ తల్లీ తండ్రీ ఏమైనారు."

"ఉన్నారు. కాని తల్లి చిక్కుల్లోవుంది. నేను రమ గార్డియన్. తల్లితో విరోధం పెట్టుకుందికూడాను. తండ్రి చచ్చిపోయినాడు"

"ఎందుకూ?"

"ఆమె మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని చూస్తోందనీ, అంతకుముందు ఆమె నీతి ప్రవర్తన తనకి తలవొంపులుగా వుందనీ."

"ఎందుకు?"

"అది వేరే కథ. ఇది విను"

"ఇట్లాంటి వాళ్లకోసరమా, వాళ్ల శీలాన్ని రక్షించాలనా, నా జీవితాన్ని ధ్వంసం చేసుకుంది నేను?"

"తరువాత పశ్చాత్తాపపడుదుగాని, పశ్చాత్తాపానికి చాలా ఏళ్ళున్నాయి. పైగా నీబోటివాళ్ళకి కాలం అనంతం పశ్చాత్తాపానికి ముందు. విను. ఈ కథాపాఠం వొచ్చేజన్మకి ఉపయోగపడుతుంది ...... రమ తనకింకేం చదువు వొద్దంది. కాని బలవంతంచేసి వొప్పించాను. ఇంకా నెల రోజు లుంది కాలేజి తెరవడానికి. కాలేజి దగ్గరికి వొచ్చినకొద్దీ రమ దిగులు ఎక్కువయింది. ఎందుకని అడిగితే కాలేజీలో తక్కిన ఆడపిల్లల్ని భరించలేనంటుంది. వాళ్లసంగతి నీకెందుకు? అంటే, వాళ్ళు తన వెంటపడి తమ సంగతులు చెప్పాకుని తన అభిప్రాయాల్ని అడుగుతారుట. ఎన్నాళ్ళు తాను

అబద్ధాలు చెప్పగలదు? తప్పిజారి ఎన్నడన్నా నిజం మాట్లాడగానే, అందరూ విరోధులై, తనని ఏడిపించడం, తనవెనక గుసగుసలూ నవ్వులూ ప్రారంభిస్తారు. ఇంక వాళ్ళ ద్వేషాలు, తమ ఇంటి సంగతులు గొప్ప చేసుకోడం, తమ అందాల్ని చూసుకోడం, ప్రతివారూ తమ ఆకర్షణలో పడుతున్నారనుకోడం, చాలా దుర్భరంట. అవంతాపోనీ అసలు సంగతి విను. జ్యేష్ట పౌర్ణమి రాత్రి అది. సాయంత్రం మల్లావర్షం కురిసింది. నేను నా ఆఫీసు గదిలో నిద్రపోవడమే అలవాటు. పడకగదిలో నా భార్యగారితో ఆ పందిరి పట్టెమంచంమీద పడుకోడానికి ఎన్నడో తిరగపడ్డాను. ఆ రాత్రి వరండాలో ఎవరో తిరుగుతున్నారనిపించింది. నా రెండో గుమాస్తామీద నాకు అనుమానం. నిద్ర కొంచం మెళుకువ వొచ్చింతరవాత చప్పున తలుపు తెరిచి బైటికి చూశాను. ఎవరూ కనపడలేదు. 'అర్థరాత్రి దాటివుంటుంది. నిండు చంద్రుడు నడినెత్తిన, వానకడిగిన ఆకాశంలో తెల్లని మబ్బులమధ్య వూగుతున్నాడు. అట్లాంటప్పుడు చంద్రుడు ఎంతో వొంటరిగా కనపడి, ఏదో జాలిపుడుతుంది.

మా వరండాకింద చిన్న తోట. దాంటోంచి గోరింటపువ్వులు విజృంభించి గాలినంతా పరిమళంతో నింపుతున్నాయి. వాననీళ్ళు గుంటలుగా మొక్కలకింద నిలిచి వాటిల్లో వెన్నెల నీడలతో ఆడుకుంటోంది, చెట్లు కదిలినప్పుడల్లా. ఎండాకాలంతరవాత వానలు వెలిసిన రాత్రుల్ని తలుచుకో. పట్టణాల్లో ఈ ఉద్యోగాలువొదిలి, ఏ పల్లెటూరికో వెళ్లి శాంతంగా ఆ అందం అనుభవించాలని గుండెనిపీకే రాత్రులు. ఎవరో ఈ భూమికిచెందని ప్రియురాలి కంటిలో ఆ వెన్నెల మెరుగులు చూడాలని కలలుకనే రాత్రులు. కాని కలుగుతుందా ఏ అదృష్టమైనా కలలతో! పల్లెటూరికి వెళ్ళగలిగాడా, ప్లీడరీ వృత్తి వొదిలి, అన్ని అందాలకలలు మనకిచ్చిన నండూరి సుబ్బారావు గారూ? చూస్తో నుంచున్నాను స్తంభాన్నానుకుని. చీకట్లో స్తంభానికి అటుపక్క రమ కూచునివుంది. నన్ను తెలుసుకున్నట్టన్నా లేదు. చూస్తోంది తానూ ఆకాశంలోకి. వెనకగా వెళ్లి బుజాలమీద చేతులు వేశాను. కదలలేదు. ఆమె వీపుని నా పొట్టకి ఆనించుకుని అట్లా నుంచున్నాను. మమ్మల్ని ఇద్దర్నీ చిన్నచలితో పులకరించే గాలి చుట్టేసి, పరిమళాలతో పలకరించాలని చూసింది. కాలంఅనేది మనసులోని మాయ అంటారే! అది నిజం. అట్లాంటప్పుడు తెలుస్తుంది. నా చేతులకింది ఆమె బుజాలు, నా పొట్టకి వొత్తుకుంటో ఆమె వీపు, ఆ నీడలోని ఆమెజుట్టులో దూరపు వెన్నెల రేఖలు

నాకళ్ళకింద. ఆమెనించి అగరునూనె, నార్సిసస్ పౌడరు పరిమళం, ఆమె వొంటి చెమట మత్తుతో కలిసి, అంతే. అంతకన్న నేను యోచించలేదు. ఆమెకీలేదు అని తరవాత చెప్పింది. ఆలోచనలే ఆగాయి. కాలంలేదు దాన్ని ఏరకం ప్రేమ అంటావో నువ్వు మరి : కోవెల కూసింది, తలెత్తాను. ఎదురుగా చంద్రుడి పక్కగా శుక్రతార వెలుగుతోంది. అప్పుడు నా చేతుల్ని ఆమె రొమ్ముమీదికి జరిపి - జరపాలని కాదు - ఆలోచించనేలేదు. చేతుల అలవాటు - నా చేతులదో - లేక నా రేస్ - నావంశం అలవాటో - మనుష్యజాతి అలవాటో - అంతే - ఆమె రొమ్ము తాకుతున్నాననీ తెలీదు, ఆమెను లేవనెత్తాను నాకేసి. అప్పుడు మేలుకుని నావంకా, చుట్టూ-చూసింది. ఒక పరుగుతీసి వెళ్లిపోయింది. అమె వెళ్లిందే అని అలోచనైనా లేకండా అట్లానే నుంచున్నాను శుక్రుడివంకచూస్తూ. అదేనేమో యోగుల ఆనందం" అని ఆగాడు రాజయ్య.

"తరవాత" అన్నాడు శ్యామారావు రహాశ్యంలాగు శబ్దంలేకండా.

"అంతే మళ్ళీ పదిహేనురోజులు. ఆ తెల్లారకట్ట కాలేజీకి వెళ్లిపోతోంది. రాత్రి మూడింటికి బండిఅతను వొచ్చి లేపాడు. పెట్టెలూ అవీ బండిలో పెట్టారు. నిద్రపోతున్న నాతో చెప్పడానికి వొచ్చింది. గదిలో లైటు వేశాను. నా భార్య పెట్టిన షిఫానీ చీర కట్టుకుంది. సాయింత్రం ఎవరింటోనో పేరంటంలో పూసిన గంధం మెడలో మాయనేలేదు.

"వెడుతున్నాను" అని నవ్వింది

"మంచిది సుఖంగా వెళ్ళిరా,"

"ఊఁ"

"సూరయ్య లేచాడా ?"

"బండిదగ్గర వున్నాడు."

లైటికి వొచ్చాము. మళ్లీ ఎదురుగా దేదీప్యమానంగా వెలుగుతో శుక్రుడు. ఆ దృశ్యంతో తోట మధ్య తోవలో ఇద్దరమూ ఆగాము. ముందు నడుస్తున్న ఆమె బుజాలమీద చేతులువేశాను. ఆగింది. మెల్లిగా ఏడుపు తెరలలో కదిలించి ఆ లేతవొళ్ళు, అప్పుడే గాలికింద సాయింత్రం ప్రారంభించే సరసులోని అలలమల్లే మెల్లిగా నా వేళ్లని తాకుతున్నాయి."

"ఎందుకు ?"

"నా చేతులు మళ్ళీ ఆమె రొమ్ముమీదికి వెళ్ళాయి. చప్పున వెనక్కి తిరిగింది. నన్నుతప్పించుకుని ఇంటోకి పోవాలనేమో నా కర్థంకాలేదు.

గట్టిగా కావిలించుకుని, శుక్రకాంతితోనిండిన ఆమెకళ్ళలోకి చూశాను. కాని తక్కిన నా అవయవాలలోకి ఎక్కడెక్కడికి చేరుకోవాలో అక్కడికి నా రక్తాన్ని తోలుతున్నాడు మన్మధుడు. అంతదగ్గిరగానుంచున్నా ఆమెకీ ఆ స్పర్శతో ఏమయిందో! ఇంకా దగ్గిరలో నా రొమ్ములోపలికి జరిగింది. నేను పక్కకితిరిగి ఆమెని గదిలోపలికి తీసుకునివెళ్ళా."

తరవాత ఏమేంజరిగిందో రాజయ్యా వర్ణించకండా వుండలేదు. అంత చనువైన మిత్రులమధ్య రహస్యమేముంది ?

ఆబండీ అట్లానేనుంచునివుంది. సూరయ్యా అట్లానే చూస్తున్నాడు. అమ్మాయిగారు ఇంకా రారేమాఅని, గదిలోంచే రాజయ్యా "సూరయ్యా! రమకి వొళ్ళుబాగాలేదట. సామాను లోపలపెట్టించి, బండివాణ్ణి రేపురమ్మను" అన్నదాకా.

"తెల్లారేలోపలే నన్ను వొప్పించింది, తనని కాలేజీకి పంపించననీ, నాతోనే వుంచుకుంటాననీ, నన్ను బలవంతంచేసి"

"అంతబలవంతం చెయ్యాల్సివచ్చిందా" అన్నాడు వొణుకుతున్న అసహజమైన నవ్వుతో శ్యామారావు.

"కాకపోతే. జన్మకి మెళ్ళోకట్టుకోనా ఆ పిల్లని ?"

"ఆపిల్ల నిన్ను అంతపెద్దవాణ్ణికట్టుకోగాలేనిది!"

"అదీ నీయోచన. నిన్ను కట్టుకుంటుందేమోనని కాదు. ఆపిల్లని అంత పెద్దవాణ్ణి నేను కట్టుకుంటూన్నానే అని. పర్యవసానం ఒకటేఆలోచనల్లో. కార్యాలలోకాదు. ఒకటేయోచన. రెండుచివర్లనించే చూశాము. ఆకాస్త బేధమూ, కార్యరూపంలోకి వొచ్చేప్పటికి కొండంతలుబేధం కన్పిస్తుంది. నా వయసెక్కడ, ఆమెవయసెక్కడ ? నాకెంతభారం ?"

"ఏంభారం ?"

"ఖర్చు పరవాలేదనుకో. కాలం, కీర్తి, తద్వారా రాబడి, వొంటి ఆరోగ్యం - అన్నీ భారమే. ఇవన్నీ యోచించాననుకున్నావా ? లేదు. ఆలోచించకండానే తన, జాగ్రత్తలోనే వుంటుంది మనసు స్వభావికంగా. చలంకధల హీరోననుకున్నావా ?"

"మరి ఎట్లావొప్పుకున్నావు ?"

"మూర్ఖుడా! ఆసమయంలో జమీలు ధారాదత్తాలుచేసిన వాడున్నారోయ్..."

"ఏ సమయంలో"

"ఏసమయంలోనా ? ఈ సమయంలో"

అని చేతులతో చూపించాడు రాజయ్య.

"నాదగ్గిర జమీందారీ వ్యాజ్యాలలో మూడోవొంతు, అట్లాంటి సమయాలలో వాళ్లు స్త్రీలకిచేసిన వాగ్దానాలు చెల్లవని వాళ్ళు తగాదా పెట్టినవే"

"నువ్వూ అంతేనా !"

"భేదంవుంది. తెల్లారినతరవాత లేదు పొమ్మనరు ఆ వెలమదొరలు. దర్జాకి లోపమనో, లేక నిజానికి నిలబడాలనేది పూర్వకాలంనించి రక్తంలో వొస్తుందో, లేక వృత్తబుద్ధిలేనితనమో !"

"మరి ఇక వ్యాజ్యాలెందుకు ?"

"ఆవాగ్దత్తాలుచేసే నిమషాల అసలు మరి ఆ స్తి ఎంతవుందో మరిచిపోతారు. పక్క వాళ్ళ జమలుకూడా రాసిఇస్తారు. అడిగితే కొన్నినక్షత్రాల్ని కూడా దానంచేస్తారు."

"సరే నువ్వేంచేశావు ?"

"నేనట్లానా ? మర్నాడు రాత్రే రై లెక్కించాను రమని"

"నీచుడా !"

"నీకన్నా నా ?"

"కాని నేను ఏమన్నా..."

"సరేలే తెలుసు. రమని నాదగ్గర అట్టేపెట్టుకోవడం వల్ల మా ఇద్దరిలో ఎవరికన్నా శ్రేయస్కరమా ? ఆరాత్రి జరిగినపని ధర్మమని అంటావా!"

"అనను"

"వాగ్దానం చేశానుకదా, ఆమె చేతుల్లో అదుముకుని నోటిలో నోరు పెట్టి అడిగే నిమషంలో అని, ఆ అధర్మాన్ని అట్లా చేస్తోనే వుండమంటావా ? అదిగాక ఆమెకి పద్దెనిమిదేళ్ళు లేవు. ఆ వొక్క పనితో, ఆనాటి రాత్రి పురుషుడు యువ్వనవతికి ఏమౌతాడో తెలుసూ ? దైవం అందువల్లనే ఈ సంసారాలు ఇంతవరకన్నా నిలబడడం, ఇట్లా విచ్ఛిన్నంకావడం కూడాను. మొదటు ఆమెకి ఆ సుఖమిచ్చిన పురుషుణ్ణి ఎన్ని జన్మలకీ మరవలేదు స్త్రీ. గర్భాదానమని పేరుతో లేత పిల్లల గర్భాల్ని చించిపెట్టే దౌర్భాగ్యుల్నే తప్ప. అటుతర్వాత ఏ ప్రియుడో ఆమెకి అసలు సంగతి రుచి చూపినప్పుడు అన్నీ వొదిలి లేచిపోతుంది, జీవమున్న స్త్రీ ! అతను ఎవరు కానీ, ఎంత అధముడుకానీ. మర్నాడు రమ నా ఆఫీసు బల్లపక్కన కుర్చీ

వేసుకుని, ఆరనిజుట్టుని నా కాయితాలనిండా వేస్తో, నా కళ్లకేసి ఆరాధిస్తో చూస్తూ కూచుంది. ఆరాధన దేనికి? తనకి పునర్జన్మ నిచ్చాననీ, కొత్త స్వర్గ ద్వారాలు తెరిచాననీ; తన వొంటికి ఓ సార్థకతను తెలిపాననీ - తన భూమినే నందనవనంగా పుష్పింపచేశాననీ-అది నా ప్రత్యేకతే అనుకుంటుంది. ఆలోచించదు. ఆ ప్రజ్ఞ అంతా నా ఒక్కడిదేననీ. వృత్త accident ఓ దౌర్భాగ్యుడు చేతులోది జారవిడిస్తే, ఇంకోడు అందుకున్నాడు. వాళ్ళిదరూ మిత్రులు." అని నవ్వాడు.

"అట్లాంటి పిల్లని నా ఆఫీసుపని చెరుస్తో నేనేంచేసుకోను?" అన్నాడు మళ్ళీ.

"ఎందుకు ఆఫీసుపని! ఏం డబ్బులేదా?"

"ఆలోచించలేదు నేను. నా instinct అది. నన్ను రక్షించే కాపుదల. ఇప్పు డేమనుకుంటానంటే నా ఉద్యోగం డబ్బుకోసమే కాదు. పురుష లక్షణం. స్త్రీవల్లగాని, దేనివల్లగాని పురుషుడు తన ధర్మాన్ని, తన వృత్తిని మానాడా చాలా దెబ్బతింటాడని,"

"సరేలే. తరవాత?"

"ప్రతి శెలవలకీ రమతో దేశమంతా అందమైన ప్రదేశాలన్నీ తిరిగాను. అలిసి మూతలుపడ్డ మా కళ్ళని హిమాలయశిఖరాలమీది మంచునించి ప్రతిఫలించే వెలుగు మేల్కొలిపింది. కన్యాకుమారిలో కొండలికి తగిలి విరిగిపడే అలలు మాకు జోలపాడాయి. కాశ్మీరదేశపు కుంకుమపువ్వు, మలబారు జాజికాయ తోటలనించి పరిమళాలుతెచ్చి పడవలో తేలే మామీద గుమ్మరించింది గాలి. టాజ్ మహల్లో కూచుని ముంతాజ్ కథను చెప్పుకున్నాము. హంపీలో కిష్కింద శిఖరానికెక్కి కాలంలో వెనక్కి చూశాము. ఒకటేమిటి? నానిటాల్ లో రాత్రి సరస్సులో దీపాలవెలుగులు రమ కళ్ళల్లో చూశాను. ఊటీలో పైనించి చూస్తో, కింది రంగుల మబ్బుల్లో పూగాము. ఏం కాలమది? అట్లాంటి అనుభవాలివ్వడానికే డబ్బు ఉపయోగం"

"ఏం తక్కినవీ?"

"తక్కినవేమిట్లే! ఆస్తులూ, గొప్పలూ. మన సొంతానికేం వొరిగింది?"

"అనే మిగిలేవి. ఈ అనుభవం అంతటితో ఆఖరూ"

"ఆస్తుల్ని పట్టుకుపోతామా?"

"అనుభవాల్ని పట్టుకుపోతామా?"

"జ్ఞాపకాలు. జీవితంలో మాధుర్యం తాగామనే తృప్తి. చచ్చిం తరవాత మిగిలేదే అది. అంత గొప్ప అనుభవం తరవాత చావంటే దిగులువుండదు జీవితం ఇంతకన్న ఏముంది అనిపిస్తుంది"

"కాని నిజమైన గొప్ప అనుభవానికి ధనం అంత అవసరమా ?"

"తప్పకండా. అల్లాంటి అనుభవానికి: ఆనందానికి మెరుగుపెడుతుంది ధనం. ఒకే మోహవ్యాపారం, మామూలుగదుల్లోనూ, సముద్ర తీరంలోనూ జరగడంలో వ్యత్యాసముంది. కొత్తస్థలం, పరిమళాలు, సంగీతం, ప్రకృతి రామణీయకత అన్నీ చాలా తోడ్పడతాయి. వాటన్నిటికీ ధనం కావాలి."

"కాని గొప్ప అనుభవమే ఐతే, చిత్తం ఏకాగ్రమై ఇంకేమీ చూడలేమేమో ?"

"అవును. కాని అనుభవానికి ముందూ తరవాతా అనేవి ఉన్నాయిగా. ధనం అందరికీ పంచుతామంటారా ? ఇప్పుడు కొంతమందికన్నా చాలా అందమైన జీవితభాగాలున్నాయి. అప్పుడెవరికీ వుండవు ?"

"మరికొందరి కటికదరిద్రం..."

"అవన్నీ తేలుసులే. ఏమిటో పూరికేతిని కని బతకడం ఎందుకు ? అంతకన్న దరిద్రమే మేలు."

"దరిద్రమంటే ఎరగవుగనక...నా చిన్నతనంలో..."

"నేనూ చిన్నప్పుడెరుగుదుననుకో. నువ్వనేదంతానిజమే. కాని అందం లేని జీవితమేమిటి పోదూ !"

"అందానికీ ధనానికి అంత సంబంధం తప్పకండా వుండాలని"

"బోలెడు. కాకపోతే ఆ ధనంకోసం ఇన్నితగాదాలెందుకు ? ధనం అక్కర్లేని యోగులున్నారు. తక్కినవాళ్ళందరికీ అది అవసరమే."

"గాంధిగారికీ ?"

"ఆ. తనకిఅక్కర్లేదు ధనం, కాని తనప్రజలదరిద్రం పోగొట్టడానికేగా ఆ తాపత్రయం !"

"కాని తనకి స్వంతానికి ధనం అవసరంలేదుగా."

"అంటే ధనంవల్లవచ్చే సుఖాలుకూడా అవసరంలేదన్నమాట."

"అవును. అదే నేననేది. ఆయనకిఎందుకు ఆ సుఖాలు ?" అక్కర్లేదు. ధనంతోపనిలేని ఆనందాలున్నాయిగనక."

"అల్లాఅనకు. అల్లాఐతే ముళ్ళకంపమీద పడుకునే బైరేగీ, వీపు రక్తంకారేట్టు పగలకొట్టుకునే బిచ్చగాడూ, ఆ బాధల్లో మనం ఎరగని

ఆనందాల్ని అనుభవిస్తున్నారంటావా? వేరే అవసరాలకోసం ఎన్ని బాధల్ని కిక్కురుమనకండా అనుభవించగలడనుకున్నావు మనిషి! రాత్రింబగళ్లు clients తో కిందామీదా పడడం ఓ సుఖమా? అదిగాక ఇట్లా ఏలోక సంస్కారంలోనో మునిగినమనిషికి ఆనందం అనుభవించగల ఆసక్తేపోతుంది. చల్లగాలిని చూసినా భయమైపోతుంది. ఆలోకంలో ఏదోవొరుగుతుందనే కాంక్ష, తమధర్మమనే మత్తు సామాన్యప్రజలనించి ప్రత్యేకతనూ ఆధిక్యతనూ తాము feel అవాలనే అహంభావం, వైరాగ్యపుకీర్తి, తన మనసులోనే గొప్ప త్యాగమూర్తి అనే పలుకుబడి......ఎన్నని!"

"సినిక్"

"సినిక్ ఎవరో తెలుసునా. మన కలలకీ, అబద్ధపునమ్మకాలకీ, గాయం కలిగేట్టు నిజంమాట్లాడేవాడు."

"అదేనిజమని ఏమిటి?"

"ఏమైతేనేం? ధనంతో పనిలేకండా బతుకుతున్నాము, సుఖపడగలమా అనేవాళ్లు, గతిలేకనో, గొప్పకోసమో, వాంఛల్ని అరికట్టుకున్నారనుకో. కాని చాలామందికి మామూలు మృగవాంఛలకన్న ఎక్కువ వుండనే వుండవు. వాళ్ళకి ఎక్కువ ధనంతో పనిలేదు. ఇప్పుడు డబ్బు సంపాదించే వాళ్లల్లోకూడా, ఆ డబ్బునించి ఆనందం పొందడం ఎంతమందికి తెలుసునంటావు? అసలు డబ్బు పంపకం వేరేవిధంగా వుండాలి. ఎవరి అవసరాల్ని పట్టి వారికి ఎంతధనం కావాలో నిర్ణయించాలి. కమ్యూనిజంలో సంఖ్యని పట్టి పంచుతారు. అట్లాకాదు అవసరాన్నిపట్టి. తక్కువతినేవాడికీ ఎక్కువ తినేవాడికీ, రేషన్‌లో ఒకటే కొలతబియ్యం ఇవ్వడం ఎంత బుద్ధితక్కువో, సరిగా అర్థయుతంగా ఖర్చుచేసుకోడం తెలీనివాడికి ధనం ఇవ్వడమూ అంతే అవివేకం. ధనమేకాదు, ధనమిచ్చే అనుభవంకూడా. గొప్పరచనా, గొప్ప సంగీతము, తప్పనిసరిగా వినిపిస్తే, రసికతలేని రాజు నిద్రపోతాడు. పూనా బాంబే మధ్య ఫస్టుక్లాసులో ఒంటరిగా కమనిఆనుకుని కిటికీలోంచి చూస్తూ కూచోడం ఒక గొప్ప అనుభవం. కాని లక్షాధికార్లూ బిచ్చగాళ్ళూ కూడా కునికిపాట్లు పడుతోనో, పేపరు చదువుకుంటోనో కూచుంటారు. మామూలుగా తిరిగే వాళ్ళేకాదు, మొదటిసారి కొత్తగా చూస్తున్నవాళ్లు కూడా. లోనల్లా స్టేషన్‌లో ఓసారి, excursion వచ్చిన కాలేజీ విద్యార్థులు కాఫీకోసం తొక్కుకుంటో, అటూ ఇటూ కళ్ళెత్తిన పాపాన పోలేదు.'

"సరేలే కానీ అట్లానే పంపకం పెట్టిద్దాము. నీకథ కానీ."

"అవును మూడేళ్ళు తిరిగాము. రమకిమాత్రం చదువు రానేలేదు. ఎట్లాగో ఇన్టర్ దాటింది. కడుపు వొచ్చింది. రెండో నెలలో నాతో చెప్పింది. వెంటనే ఏమీ ఆలస్యం కాకండా ఎవరో వొకర్ని పెళ్లిచేసుకో మన్నాను"

"ఆ. ఆ. ఆ."అని అరిచాడు శ్యామారావు ఆశ్చర్యంతో అసహ్యంతో. ఆ మాటలు తన చెవులు నమ్మలేనట్టు. అది మూలుగులాగ వినపడ్డది రాజయ్యకి.

"ఏమిటది? ఏమన్నా వెప్పా?"

"ఆ చాలా నెప్పి! పెళ్ళి చేసుకోమన్నావా? ఎట్లా అన్నావు ఆమాట?"

"ఏమి?"

"సరేలే. రమ ఏమంది?"

"వొప్పుకోలేదు."

"వొప్పుకుంటుందనికూడా అనుకున్నావా ఏమిటి? చాలా గొప్ప వాడివి. ఆ పిల్ల మనిషా కొయ్యబొమ్మా!"

"అంతకన్న ఏంచేస్తుంది?"

"అదేలే. ఎందుకు చేసుకోనంది?"

"ఏమో! అనడం నామీది ఇష్టంవల్లనంది. ఇష్టానికే. ఇష్టం వుండనీ. పెళ్ళికాక ఏంచేద్దామని? అని బలవంతంచేశాను"

"రాస్కెల్!"

"ఆగు ఆగు. మాటలనడం సులభమే. ఆపరిస్తితిలో నువ్వేం చేశే వాడివి."

"అసలు ఆపరిస్తితి రానీను."

"ఎట్లా? అసలు ఆ సంబంధంనించి చల్లగా తప్పుకుంటా నంటావు దొంగమల్లే. సరే అంతవరకూ ఏ పొరపాటునో దిగావనుకో."

"నేనే భరిస్తాను."

"పెళ్లి చేసుకునా?"

"అదన్నా సరే"

"ఇద్దరు పెళ్ళాల్ని ఓ యింటో పెట్టి! నీకేం గవర్న మెంటు నౌకరివి. తెల్లారితే నాబతుకు నలుగురి జేబులమీదా ఆధారపడ్డదోయ్. ఎంత జాగ్రత్త పడ్డాను! మరి రమని కాలేజీకి పంపడం, శెలవల్లో ఇద్దరం విడివిడిగా ప్రయాణం చేసి ఎక్కడో కలుసుకోడం, అంత దూరంలో తెలుగు మొహం కనపడితే ఆ

చోటనించి పలాయనం కావడం - ఎవరికీ తెలీలేదనుకో. మరి పెళ్ళి చేసుకోనా? ఆనాడు చేసుకోవొచ్చుననుకో. బుద్ధిగల బ్రిటిష్ ప్రభుత్వం తప్పుడు బిల్లులు అల్లకండా మన కాశీశ్వర్రావుని జైలులోనే వుంచింది అప్పుడు. కాని నాకూతురు యీడువున్న ఆ పిల్లని..."

"పోనీ పెళ్ళి లేకండానే..."

"వూరికే నాన్సెన్సు మాట్లాడకు. ఆపిల్ల భవిష్యత్తు..."

"ఏమన్నా అను. ఏంచేసినా, ఎన్ని కష్టాలుపడ్డా, నాశనమైపోయినా, ఆ పిల్లని ఇంకోడికి అంటకట్టచూడటం - ఆ పిల్లకి, ఆ వరుడికి, చాలా అన్యాయం."

"అన్యాయం, - అనడంతో సరిపోతుందనుకున్నావా? ఈ idealists అట్లానే తమ జీవితాల్ని ధ్వంసం చేసుకుని, ఇతర జీవితాల్ని - నాశనం చేసేది. నాశనమైనాసరేట. నాశనమయ్యే పని ఎందుకుచెయ్యాలి తప్పించుకునే మార్గం వుంటే?"

"నీ ఆనర్"

"నాకట్లాంటిబుద్ధి తక్కువ ఆనర్ లేదు. అన్నీ కొన్ని మాటలు ఏర్పడ్డాయోయ్. వాటికి అర్థంగాని, ముఖ్యోద్దేశంగాని యోచించరు. కాలంతో అవి మారతాయనీ, వాటిఅర్థమే మారుతుందనీ తెలుసుకోరు. వాటినేపట్టుకుని వేళ్లాడతారు. వేళ్లాడిగోతుల్లోపడండి. కాని అవేగొప్పవని, వాటితో ఇతరుల కార్యాల్నీ జీవితాల్నీ కొలవకండి. మీరేగొప్పఅని మీ మనసుల్లో కులకండి. ఆమాటల్లో ఎంత స్వార్థంవుందో, ఇబ్బందిలోంచి తప్పించుకోడానికి అవి ఎంత వీలైన దొంగమార్గాలో మరిచిపోతారు. Practical గా యోచించడం నించి, కార్యదక్షతనించి, ఇతరులకి ఉపయోగపడే అవసరంనించి, సులభంగా తప్పిస్తాయి - ఈనీతీ, ధర్మం, ఆనర్, దేవుడూ, ఇట్లాంటివి. మీకంటే ఓ పాఠం ఎక్కువ నేర్చుకున్నవాళ్లున్నారు. వేదాంతులు. ఈ లోకమే మాయ అని ఎవరికీ ఏమాత్రం సహాయపడకండా, అసలు ఆ యోచనే చాలాభారమై, మనసులిని కట్టేసుకుని తమ గుళ్ళల్లో నవరంధ్రాలూ మూసుకుంటారు. ఎవరూ చూడకండా, వీలైనపుడల్లా, లటుక్కున ఏ ధనాన్నో, ఏ ఆడదాన్నో వేసుకుని, చప్పున మళ్ళీ గుంటలో దూరతారు. ప్రశ్నగాని బాధ్యతగాని వొచ్చిందా అసలు పలకరు, వాదించరు - అంతామాయ, అహంబ్రహ్మాస్మి అంటారు."

"కాకపోతే లోకం నిజమంటావా ?"

"మాయా ? మాయఐతే, ఆమాయ అనేవాడెవడు వినేవాడెవరు ?"

"సర్వం ఏకం"

"నిజంగానే ఇదంతా మనకి ఏకంగా కనపడ్డప్పుడు ఏకం అందాం. ప్రస్తుతం భిన్నమేగా - ఆ తప్పుడుమాటలెందుకు? చౌర్యానికి, వేరేదేన్నించో తప్పించుకోడానికి. ముఖ్యంగా తమనించో వాళ్ళల్లో సిన్‌సియర్ మనుషులు లేకపోలేదు, నీబోటివాళ్లు. వాళ్లనుకునేనీతి, ఆనర్, పద్ధతులకి ఈ ప్రపంచం విరుద్ధం. భరించలేక కళ్లుమూసుకుంటారు మాయ అని. ప్రేమ భగ్నమైన మనిషి స్త్రీనితిట్టి, ప్రేమఅనేది వృత్తకవిత్వమనడూ - అట్లాగే."

"చివరికి ఏంచేశావు ?"

"పెళ్ళిచేశాను భాస్కరరావుకిచ్చి. నువ్వు చూశానన్నావుగా అతన్ని ?"

"అతని మొహం ఎట్లాచూడగలిగావో! నీ ఉంపుడుకత్తెని అతనికి అంటకట్టావు. పైగా నీపిల్లని అతని పిల్లగా, అతను మోసపోయి. యావజ్జీవనమూ పోషించేట్టు చేస్తున్నావు. ఆమోసాన్ని ఎట్లా భరించావో!"

"నీమాట లెట్లా వున్నాయంటే - ఈ భూతదయగాళ్ళు - నిలువునా కోడి ప్రాణం ఎట్లాతీశావు అంటారు ఆశ్చర్యంగా. వాళ్ళ కళ్ళఎదటే ప్రతి నిమషం లెక్కలేని ప్రాణులు చస్తోవుంటే. ఒకదాన్ని ఒకటి మింగుతో వుంటే"

"వున్నారులే ఘాతుకులూ మోసగాళ్ళూ. నువ్వూ అంతేనా అని..."

"పెద్దపులిని చంపడమూ ఘాతుకమేనా ? ఆ మోసం చెయ్యకపోతే కలిగే ఘోరాల్ని తెలుచుకో."

"సరేలే. ఈ గొడవల్లో ఆ తల్లి ఏంచేస్తోంది?"

"ఆకథ తరవాత చెపుతా రమకి పెళ్లిచేశేశాను, ఆభాస్కరరావుకి నువ్వు చూశావుగా!."

"ఎట్లా దొరికాడు అంత సులభంగా ?"

"వాతో తిరగేప్పుడు రమ నాకూతురు. అందుకని యువకులు కొంత వెంటపడేవారు. రైల్లో తటస్థపడ్డాడు ఈ భాస్కరరావు. అతనూ అజంతాకి వొచ్చాడు, మేమక్కడ వుండగా రమ వెంటపడ్డాడు పెళ్లిచేసుకోమని. నవ్వేసి అతనినించి తప్పించుకున్నాము. రమ కాలేజి ఎడ్రసు తెలుసుకుని, ఆమెకి ప్రేమలేఖలే గాక, ఆమెని చూడ్డానికికూడా వెళ్ళేవాడు.

కాని లాభంలేదని చెప్పేసింది రమ. ధనవంతుడు, భార్యని వొదిలేశాడు, కనక రమనిచ్చి పెళ్లిచేశాము"

"వ్యభిచారం చేయించావన్నమాట"

"అర్థంలేని మాట మానెయ్యి. 'స్త్రీ' అనే పుస్తకం చదువు. కొంచెం మాటలకి అర్థాలు తెలుస్తాయి."

"పోనీలే. రమకి నీమీదకదా యిష్టం?"

"అవును. నేనేం మారానా? మరీ నిలవలేనప్పుడు నాదగ్గరికి వొస్తానే వుండేది."

"పెళ్లి ఐనాక కూడానా?"

"ఊఁ"

"ఏమిటి! రానిచ్చేవాడా?

"నేను గార్డియన్నికదూ!" అని నవ్వాడు రాజయ్య.

"ఘోరం. ఇంక మాట్లాడకు. భరించలేను." అని శ్యామారావు లేచి పోయి కిటికీ దగ్గిరనుంచున్నాడు. రాజయ్య నవ్వుతున్నాడు.

"ఈ సంగతులు తెలిస్తే నువ్వు నన్ను నీయింటికి రానిచ్చేవాడివే లేదనుకుంటాను. ఇంక నాపిల్లనేం చేసుకుంటావు నీ కొడుక్కి! ...... కాని ఇది తెలుసుకో. ఎక్కడో నీవంటి వెర్రివాళ్ళు తప్ప, అందరూ ఇట్లాంటి పనులు చెయ్యకపోవొచ్చు. కాని సమయం వొస్తే చేసేవారే. అక్కడే ఈ కర్మ వేదాంతంతో పుణ్యపాపాలతో నాతగాదా. కొందరికి పాపకార్యాలుచేసే అవసరం కలుగుతుంది. కొందరికి కలగదు. అవసరంవల్ల చేసిన వాళ్ళు, పాపాత్ములు, ఆ అవసరంలేక చెయ్యనివాళ్ళు పాపాత్ములూనా! భయంవల్ల మానేసే భీరులు అంతకన్న అతిపవిత్రులు. ఇంక పోలీసువాళ్ళకన్న ఏం గొప్ప ఆ దేవుడు?"

"అదంతా పోనీ ఆ పిల్ల ఎటువంటిదో మధ్య మధ్య నీదగ్గిరికి రావడానికి"

"ఎటువంటిదీకాదు. చాలామంది కుటుంబస్త్రీలకన్న ఉత్తమురాలు. ఆ పిల్లకి వీలుచిక్కింది అంతే."

"నేను నమ్మను. వంశంలోనే వుంటుంది ఆ గుణం. విశాలాక్షికి తెలుసా ఇదంతా? ఏమయింది అన్నేళ్ళు కూతుర్ని నీకు వప్పచెప్పి!"

"చెపుతా ఆకథ. విశాలాక్షి ఏమీ దుర్మార్గురాలు కాదని నీకు తెలుసు. కూతురుకథ విని అమాంతం నువ్వు ప్రేమించి నీ పిల్లని నరకంలోకి తోశేశావు. లోకం ఎంత మారిపోతోందో! మారడమంటే ఇదివరకు రహశ్యంగా జరిగేవి ఇప్పుడు ధైర్యంగా బహిరంగంగా జరుగుతున్నాయి: అదే మార్పు. నీవంటివాళ్ళ మనసులు మాత్రం ఇంకా చీకట్లో కళ్లుమూసుకుని 'ఏంలేదు' అని పాతకలలు కంటున్నాయి. ఈ లోకమంతా నరకానికి పోతే మనమూ పోదాంలే. మనంమాత్రం స్వర్గానికిపోయి ఏంచేస్తాం అక్కడ, ఏంతోచకండా!"

"సరేలే. చివరికేమయింది?"

"ఏంకాలేదు. కథఅనుకున్నావా ఏమిటి! అతనికి నిజం తెలీడం రమని వొదిలెయ్యడమూ అదీ. ఓనెలముందుగా పిల్ల పుట్టిందన్నారు. ఆ పిల్లా హాయిగా వుంది. నువ్వు చూశావుకాదూ? అది నాకూతురు. తరవాత పిల్లలులేరు.

"సరిగా విశాలాక్షిమల్లే వుంది అనుకున్నాను అప్పుడు"

"అవును"

"తరవాత?"

"అతనికి గ్రీక్ భాష వొచ్చుట. అందుకని గ్రీసుదేశానికి మన రాయబారిగా వెళ్ళాడు".

"నవ్వుటాలా!"

"కాదు. ఇంకా ఆరోజుల్లో అనేవాళ్ళం Penguin బొమ్మలు గీశాడని antarctic continent కి రాయబారిగా వెళ్ళాడని. కాని వెళ్ళింది నిజం. ఎక్కడికి వెళ్ళాడో నేను జ్ఞాపకం పెట్టుకోలేదు."

"అంతేనా?"

"అంతే"

"విశాలాక్షి"

"చచ్చిపోయిందికాదూ! నాలుగేళ్ళయింది".

"నీకెట్లా తెలుసు విశాలాక్షి-కాలేజీరోజులతరవాత? ఆసంగతిచెప్పు. అన్నట్టు చెప్పావుగా, నీకు అమెమీద ప్రేమఅని. ఒక్కసారీ చూచాయగా నన్నా తెలియనిచ్చావుకావు."

"ప్రేమఅన్నానా? అవునులే. కాని నీతో చెప్పడమెందుకు?

అదో అవస్థా నీకు ? చెప్పితే ఏంచేశేవాడివి ! నేను చెప్పానుకదూ, అనవసరంగా బతుకు బయలుచేసుకునే రకం మనిషిని కానని".

"ఆ ప్రేమఫలితం కూతురులో అనుభవించావులే. కాని విశాలాక్షి అందం ఎక్కడ ! రమకి ఎక్కడవుంది ఆ అందం ?"

"అందమే ప్రధానమనుకోకు. రమ రతిచాతుర్యం (ఆమాట అనలేదు రాజయ్య. రాయడానికి వీలులేని బూతుమాట అన్నాడు) విశాలాక్షికి ఏం చాతనౌను ?"

"అదేమిటి ? విశాలాక్షి రహస్యాలు నీకేం తెలుసు?"

రాజయ్య మాట్లాడలేదు.

"ఏం ? మాట్లాడవు."

"మా అత్తవారివూరూ, విశాలాక్షి అత్తవారివూరూ ఒకటే"

"ఓహో! చాలా ప్రబుద్ధుడివోయ్. ఇళ్ళుకూడా పక్కపక్కనేనా!"

"కాదు"

"ఆమెభర్త అసమర్థుడా. అనామకుడా?"

"ఏమీకాదు. నాకు చాలా మిత్రుడు."

"ఓహో ! ఆమోసంకూడానా? చూడ్డానికి ఇట్లావున్నావుగాని. చాలా వ్యవహారకర్తవి."

"అట్లాంటిదేమీకాను. నన్ను మరీ ద్రోహికింద జమకట్టకు అతనిమీద నాకు చాలా గౌరవం-అదే విశాలాక్షి భర్త చక్రపాణిమీద. అతనిమీద విశాలాక్షికి . గొప్ప ప్రేమా గౌరవం. అతను చచ్చిపోయినాడు రమకి పధ్నాలుగేళ్ళప్పుడు."

"అప్పుడు తమరు వోదార్చారా ?"

"అప్పుడు ఆ కుటుంబవ్యవహారాలు నేను చూడ్డాల్సివొచ్చింది. అందువల్ల రమ నన్ను తన గార్డియన్‌కింద..."

"తండ్రికింద అను. నీకేంజంకు ? నిండామునిగినవాడికి !

"వుండవోయ్ ! భర్త ఆస్తిఅంతా చిక్కుల్లో పడ్డది. అవన్నీ విడతీసేప్పటికి ఏమీ మిగిలేట్టులేదు. ఆ విచారంతో విశాలాక్షికి దైవభక్తి ముంచుకొచ్చింది. అదేదో ఆశ్రమం తిరపతిదగ్గర అక్కడికిపోయింది."

"ఎప్పుడు ?"

"భర్తపోయిన మూండేళ్లకి, రమ నీ కాలేజీలో ప్రవేశిస్తుందనగా. నువ్వెక్కడ వున్నావని తెలీదు. తెలిస్తే నేను స్వయంగా రమని నీకు వప్ప గించేవాడిని."

"ఆ మూండేళ్లల్లో నువ్వేంచేశావు? నీమూలానేమో విశాలాక్షి ఆ ఆశ్ర మానికి వెళ్ళింది."

రాజయ్య బిగ్గిరిగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావు ?"

"మీ నీతిపరుల కున్నంత nasty minds మురికె మనస్సులు ఎవరికీ వుండవనుకుంటాను అదేగోలకద! అదంతా ప్రాముఖ్యమా? అంతకన్న ముఖ్యమైన సంగతులు లేవా ? ఓ మొగాడూ ఆడదీ పడుకోడమ నేది అంత అసాధారణమూ ఘోరమూ ఎందుకవుతుంది మీమనసుల్లో! నిత్యమూ నీచుట్టూ సృష్టిఅంతా లక్షవిధాల జరుగుతున్న పని ! అసలు మీరు ఆవిషయం జోలికి పోరు. కాని అది మీ సమీపంలో ఎక్కడన్నా జరిగినట్టువుందా, ఇంక దాన్ని పసిపట్టుకుంటో ముక్కుని ఆ వాసనమీదనే కేంద్రీకరించి వెతుకుతారు ? గాటియర్ రాస్తాడులే, ఈ విమర్శకులు కథల్లో బూతు భాగాలదగ్గిరికి, పందులు బురద కుళ్ళుని వెతుక్కుంటో పోయినట్టుపోయి కెలుకుతారట. కెలికి బాగా చప్పరించి, మనసు మురికిఅయిందనీ, జిడ్డుపట్టిం దనీ అరుస్తారు. మరి తనివితీరని ఆ ముట్టెలు వొదిలిరావు ఆ స్థలంనించి ఓపట్టాన. 'ఏంమిగిలింది? ఏంమిగిలిందని ?' యింకా వెతుక్కుంటాయి పాపం!"

"సరేలే. ఆ ఉపన్యాసం చాలు సంగతి చెప్పమూ"

అందువల్ల రమకి నేను గార్డియను ఐనాను. ఆమె చదువుకి నేనే ఖర్చుచేశాను."

"ధనదానం, గర్భాదానంకూడా చేశావు తల్లికీ కూతురికీకూడా. ఎట్లావొప్పింది నీ అంతరాత్మ ! రమ కూతురు నీదా ఆభర్తదా ?"

"నాదేనని చెప్పానుగా"

"అచ్చ విశాలాక్షి పోలిక. అంతా ఆ అందం. కాని నీకు అందంతో పనేమిటిలే !"

"వెక్కిరించకు కథంతావిను. అప్పటికి దాచుకోలేట్లు. ఇంకా ఎంత కోప్పడతావో."

"ఊఁ" అన్నాడు శ్యామారావు బాధపడుతో.

"చిన్ననాడు నన్ను విశాలక్షి యింటికి పంపించావు జ్ఞాపకముందా ?"

"నామూలాన నీకు చివాట్లూ ప్రహరణాలూ......" అని నవ్వాడు శ్యామారావు. అని జ్ఞాపకం తెచ్చుకుని అన్నాడు—

"ఇన్నాళ్లూ అది తలచుకున్నప్పుడల్లా, నిన్నుగురించి దిగులుపడ్డాను, నామూలాన అన్యాయంగా అవమానపడ్డావని"

"పడితేనేం? పర్యవసానమో! ఇప్పటికన్నా తెలుసుకున్నావు. వొచ్చిననష్టంఏమీలేదు. జీవితంలోఎన్ని అవసరంలేని పశ్చాత్తాపాలు. వకీలువవు తెలుస్తుంది. నిజంతెలీకండానే అట్లా కుములుతో చచ్చినవాళ్ళెందరు? మొపాసా 'నెక్ లేస్' కథ ఎంతనిజం? ఎంతవిషాదం?"

"అవునుమరి. నన్ను విశాలాక్షితో మాట్లాడవొద్దని ఎంత plead చేశావు? నాశ్రేయస్సుకోరేనా? కాక నీకుభయాన్సుకా? దొంగమాటలూనువ్వూ!"

"అదేలోకం తెలీని అంధత్వం. మనుష్యస్వభావం తెలీని మూర్ఖం. ఎప్పుడో విశాలాక్షి ప్రియుణ్ణైనానని, మొదటినించీ నా జాతీయతనీ, స్నేహాన్నీ సందేహించడం అన్యాయం సరే, అసలు ఎంతసంకుచితదృష్టి!"

"ఓ. అప్పుడుకాదా?"

"విను-మరి. నువ్వు పంపితే, నీ స్నేహంవల్ల అక్కడికి వెళ్ళాల్సి వొచ్చిందని. ఆ పిల్లమీద చాలా కోపంతోనే వెళ్ళాను. అటుతరువాత ఆర్నెల్లుగావును కాలేజిలో వున్నాము. ఆ ఆర్నెల్లల్లో నీతో మళ్ళీ మాట్లాడలేదుకదూ ఆ పిల్ల! నువ్వు ఎంత ప్రయత్నించినా?"

"అవును బెదిరిపోయింది పాపం!... పాపమేమిట్లే - తప్పుడు..."

"ఆగు. అంతమాటే పవిత్రమైన నీ నోటినించి! నీమీద విశాలాక్షికి ప్రేమఅంటావా లేదా?"

"కాక ... కాదు...వుందు ... దానికి ప్రేమేమిటి? నేను వుత్త Fool ని అయినాను."

"కాదు నిజంగా చాలా ప్రేమ"

"నీతో చెప్పకుండా. ఎప్పుడు? నీకింద..."

"ఆపుకో కోపం. చచ్చిపోయింది. ఇప్పుడా ...అవును నాతో చెప్పింది. అప్పుడేకాదు చచ్చిపోయేవరకూ నీ జ్ఞాపకం గొప్పగా నిలిచింది ఆమెలో. నీతో ఆమె అబద్ధం చెప్పలేదు. నిజమే నీమీదప్రేమ."

"నిజమైతేనేం? అబద్ధమైతేనేం? ఏ మొచ్చింది?"

"ఏంరావాలి?"

అనేప్పటికి శ్యామారావుకి జవాబుతోచలేదు. తనకి ఏం రావాలని వుందో, ఆఆశ వుందని తనకి తాను కూడా వొప్పుకోలేదు.

"ఏంలేదులే. పోనీ నాతో స్నేహంగానన్నా వుందా?"

"ఛీ వూరుకో. ఏమొచ్చిందట. ఏంవొచ్చేట్టు పరివర్తించావు? స్నేహమా? ఆ వయసులో వుత్తస్నేహం ఎవరికి కావాలోయ్. తమ వాంఛలేమిటో సరిగా తెలుసుకుని వాటికోసం ప్రయత్నించే ధైర్యంలేనివాళ్ళసంగతి ఇట్లానే అవుతుంది."

"ఏంచెయ్యాలంటావు? ఆడపిల్ల ప్రేమ అనగానే, నీకుమల్లే రోడ్డు మీద ఎదురువెళ్ళి మీద పడమంటావా?"

"కాకపోతే ఆపిల్లని నీపైన పడమంటావా? గోడమీద పేర్లుచూసి జడుసుకున్న వాడికి నీకు ఆడపిల్లలేమిటి? అసలు గోడమీదికి పేర్లు రానిచ్చిన వాడికి, ఆ పేర్లు కలవడంతప్ప......"

"ఇంకేమీ కలపలేనివాడికి!" అని వెక్కిరించాడు శ్యామారావు.

"వుండు. అవును. ఇతరులమీద నిందలెందుకు? నువ్వు ఆనాడు నన్ను విశాలాక్షి ఇంటికి పంపకపోతే ఈకథ జరగనేజరక్కపోను."

"ఓహో! అదీనేనే!"

"అవును. ఆ తండ్రి నన్ను మెడపట్టుకుతోస్తే గుమ్మంఅవతల పడ్డాను. ఆకస్మికంగా జరిగింది ఆపని. చివ్వున లేచి ఒక్కదూకుదూకాను ఆముసలాయనవేపు. కాని విశాలాక్షి అడ్డపడ్డది. జ్ఞాపకంవుందా?"

"విశాలాక్షి అడ్డపడ్డదని నువ్వుచెప్పినట్టులేదు"

"అవును చెప్పివుండను. అసలు ప్రారంభంఅదే. ఆమసకలో సరిగా చూడక తండ్రి అనుకుని ఆపిల్లనిగట్టిగా తోసివొచ్చాను. ఆనిమషాన తెలిసింది అది స్త్రీ శరీరమని. పైగా నన్ను అడ్డపెట్టడానికి నావేపు చేతులుజాచి నిలుచున్న పిల్లని ఎక్కడతోసి వుంటానో ఆలోచించుకో. ఆస్పర్శని నా చేతులు మరిచిపోలేదు. రాత్రంతా కలలుకన్నాను. నువ్వునన్ను వోదారుస్తున్నావేగాని, నాచేతులు నాతలలోకి పంపే ఆనందతరంగాలలో అవమానానికి నామనసులో స్థలమే లేకపోయింది."

"తరవాత వెంటపడ్డావా?

"లేదు. నాచేతులి స్పర్శని విశాలాక్షి, రొమ్ములుకూడా మరిచిపోలేదు. మనసంతా నీమీద, వొళ్ళు......"

"నీమీద"

"అవును. వొంటికి నామీద కాంక్ష"

"వొంటికంతా కాదుగా!"

"తక్కినసంగతి నేను చూసుకున్నాగా !"

"ఆరినీతస్సాగొయ్యా ! ఎట్లా ? ఏంచేశావు !"

"నేనేం చెయ్యలేదు. నాకు అనుభవంలేదు. నువ్వు ఆమెకి లెన్డుచేసిన కెమిస్ట్రీనోట్సు ఆమెదగ్గిరే వుండిపోయింది. నీతో మాట్లాడకూడదుగా! ఆ పుస్తకం నాకిచ్చింది నీకుఇమ్మని. ఇస్తో సరిగాచూసి ఇవ్వండి. లోపలఏమన్నా కాయితాలు మరిచిపోయినానేమోఅంది. అప్పటికీనాకు అర్థంకాలేదు. ఆమె సామీప్యంలో పరవశత్వమేగాని, నాచేతుల అనుభవాన్ని కళ్ళతో పునర్మరణ చేసుకుంటున్నాను. నామనసులో ఆ పమిటనీ, జాకెట్టునీ, ఇంకా అడుగున వున్న పొరలనీ తొలిగించి"

"లోపల చీటీపెట్టిందా ?"

"ఊఁ"

"ఏం ? ఏమిటాచాత కాదంటేవి ?"

"నీకు అట్లాంటిచీటీ ఒకటి రాసివుండకూడదా ? అని నీఏడుపు. రాస్తే ఏంచేసేవాడివి ? ఏం ? చెప్పు...అసహ్యించుకునేవాడివి."

"ఏమో ! ఏంచేశేవాణ్ణో !"

"ముందే తెలుస్తుంది ఆ సంగతి ఆడపిల్లలకి ఇంకా పురుషుడంటే తెలీనప్పుడుకూడా. అందుకే నే నీకు రాయలేదు."

"ఏమో ! ఎట్లా తెలుసు ?"

"ఇప్పుడన్నా తెలీటంలేదా నీమనసుకి, నువ్వేంచేశేవాడివో...పోనీలే ఇప్పుడెందుకదంతా. ఆ సాయంత్రం......"

"ఆచీటీలో ఏముంది ?"

"అవును ఆచీటీచూసి - ఏంరాసిందంటే - నామూలాన నువ్వుచాలా అవమానపడ్డావు. తలచుకున్నకొద్దీ నాకు అవమానంగావుంది. మరినన్ను ఎట్లా క్షమిస్తావో ! నీబాధన్ని పోగొట్టేందుకు నేనేంచెయ్యగలను ? అని. అంతే నావొళ్ళు పరవశమయింది."

"ఏముంది ఆచీటీలో అంతవొళ్ళు పరవశంకావడానికి ?"

"చీటీలో ఏంలేదులే. నాదగ్గిర ఆమెనుంచున్నప్పటి చూపులోనూ, మాటలోనూ వుంది కథఅంతా. 'నండూరి' వర్ణించాల్సిందే."

"కనుబొమ్మ సూడాలి - కతలు తెలియాలి"

కథల్లో కావ్యాల్లో ప్రియులమధ్య గొప్పగొప్ప సంభాషణ పెడతారా? అట్లా ఏప్రియులు మాట్లాడరు ప్రపంచంలో!"

"నీకెట్లా తెలుసు?"

"ఇందరు స్త్రీలలో - ఇన్నిరకాలవాళ్ళలో ఒక్కరూ నాతో అట్లా మాట్లాడలేదు. నాకు ఎన్నడూ ఆమాటలు రాలేదు ఏస్త్రీతోనూ. పనులు చాతనైనవాళ్ళకి మాటలతో ఏంపని! ఉత్త మామూలులోకాభిరామాయణం మాటాడతారు. కాని ప్రేమని మాట్లాడరు. ప్రేమని నోట్లోంచికార్చుకోరు ఎవరూ. అంతా చూపులో, మాటతీరులో, దేహభంగిమలో, ముఖవర్చస్సు మార్పుల్లో కనిపిస్తుంది. అది కథకుడెట్లా పట్టుకోగలడు? అందుకని అసహజమైన సంభాషణపూర్వకంగా ఆ effect తెప్పించాలని చూస్తాడు."

"సరేలే. నీగొడవకానీ"

"ఆమెకి రాశాను, నీతోమాట్లాడాలి అని. దానికి జవాబులేదు. వారంతరవాత ఆసాయింత్రం తనయింటికి రమ్మంది. అప్పటికివెళ్ళి ఏం మాట్లాడతానో నాకు తెలీదు. వెళ్ళాను."

"తండ్రీ!"

"ఏమో! నేనాలోచించలేదు. అదంతా ఆమెకి వదిలేసివుంటాను."

"చాలా పెద్దమనిషివి!"

"బైట అరుగుమీదే నుంచునివుంది. పక్కసందులోంచి రమ్మని చెయ్యివూపింది. ఆవేపున తలుపువుంది. గడియతీసింది. లోపలికి వెళ్ళాను. సంజచీకటి. దీపం వెలిగించలేదు. కుర్చీ, బల్లా, పుస్తకాలూ కనిపించాయి. ఆమెస్టడీరూం అనుకున్నాను.

"రా కూచో. ఏమిటి?" అంది.

"నానోటినించి మాటరాలేదు. ఆమెచీరనించి, తలలో మొగలిరేకుల నించి పరిమళం. కూచున్నాను. ఆమె కుర్చీకి పక్కగా నాదగ్గిరేనుంచుంది.

"మాట్లాడవేం?" అంది.

"ఆలోచిస్తున్నాను"

"అంత ఆలోచించాలా!"

నవ్వింది.

"నాథాట్సు ఆగిపోయినాయి" అన్నాను.

"ఏం?"

తలెత్తి ఆమెకళ్ళల్లోకి చూశాను.

ఇట్లాంటివి ఎట్లాజరుగుతాయి ? అని అడగకు. నాకూ తెలీదు. మన పూర్వీకులనించి రేస్ లోనే వొస్తున్నాయేమో! కాదు మృగాలలో - వృక్షాలనించికూడా తెలుస్తుందేమో! ఆ వాతావరణంలోనే మన మనసుకి తెలీకండానే ఎక్కడో లోపల పరస్పరంగా తగులుతుంది వాంఛ. వాళ్ళకి తెలీకండాకూడా, లోపలివాంఛ పిలుస్తుంది. పైమనసులులేక - లోపలి పీ్లేన్ లోనో - పిలుపులు అందుకుంటాయి - అని ఆగి—

"ఒక్క నిత్యాంధులకు తప్ప"

అని నవ్వాడు రాజయ్య

"ఊఁ..."

"కుర్చీచేతిమీదినాచేతికి నుంచున్న ఆమె చేతి వేళ్ళు తగిలాయి. ఏచెయ్యి కదిలిందో ఏమో! అంతే. వేళ్లమధ్య వేళ్ళు. చూపులమీదచూపులు ఎదురుతోనే, ఆమె చెయ్యి పట్టుకుని లాగాను, ఏమీ పాయిన్టు లేకండానే. ఆమె నావొళ్లోవుంది. తక్కిందిఆమె పిరుదులకింద నావోడి మాట్లాడింది. నా ఎదురుగా తిరిగి నామీద వొరిగింది. నాకళ్ళు మూతలుపడ్డాయి. ఏమిటి, శ్యామారావ్! మనం అమృతులమని అనుమానించాలా! ఆ అనుభవం కిటికీలోంచి దేవతలు పూలు చల్లారనుకో నామీద - ఎన్నేళ్లు బతుకు, ఆ నిమిషం మళ్ళీరాదు. తరవాత ఎందరు స్త్రీలని తెచ్చుకో, ఆ మొదటిస్త్రీ స్పర్శ అంతే. లేచింది. నా బుజంమీద వేళ్ళు అట్లానే ఉన్నాయి.

"చాకలి వొస్తాడు దీపంపెట్టడానికి. వెళ్లు" అంది

"మరి..."

"అక్కడలేదు. లోపలికి వెళ్ళింది. నేను వొచ్చేశాను. అంతే నాగదిలో వున్నానుగనక వొచ్చేశాననుకున్నాను."

"నీ 'మరి'...అట్లానే వుండిపోయింది"

"అంతే. మళ్ళీ పలుకులేదు ఆ పిల్లనించి. పదిహేనురోజులయింది. పిలుపడలేదేమో! ఎవరన్నా వొచ్చేరేమోనని. కాని పలుకులేదు. కాలేజీలో నన్నా నావంక కన్నెత్తి చూడలేదు. పదిరోజులుమూసి రాత్రిలు ఆమెఇంటిచుట్టూ తిరిగాను. ఏంలాభం ? చీటీ రాశాను జవాబులేదు. ఎట్లా అందివ్వనుచీట్లు నావంక రానిదానికి ? రాత్రులుమాని సాయంత్రాలు ఆ సమయాల్లోనే వెళ్ళాను అటు, ఇంటివాళ్ళకళ్ళు తప్పించుకుంటూ. బిచ్చగాడిమల్లే చీకట్లో పోదామా - ఇట్లాంటివి ఎన్నో పన్నాగాలు ఆలోచించాను."

"కావలిస్తే ఆపిల్లేపిలుస్తుందని యోచించే బుద్ధిలేకపోయింది నీకు."

"అవును. అందువల్లనే జయం లభించింది. ఆడవాళ్ళ వ్యవహారాల్లో అట్లాంటి వివేకంవుందా, నోట్లోకగక్కాయే.....రాత్రులు ఆ గదిలో చదువుకునేట్టులేదు. దీపం వుండదు. మరి రాత్రి చాకలి దీపం తెస్తాడంది. మరి ఇప్పుడు ఎందుకు ఆగదిలో రాత్రులు చదువుకోడం మానేసింది? అని కోపంవచ్చింది నాకు. కాని ఆపిల్లకి నేనువొస్తానని భయమన్న స్పష్టమైన సంగతి తెలీలేదు నాకు. స్త్రీ భయపడ్డదా, ఇంక లొంగిపోవడానికి ఆట్టేశ్రమ పడనఖ్ఖర్లేదనీ, ఆనాడు తెలీదు. నన్ను తప్పించుకుంటోందని కోపం.

"దాంతో 'డెస్పరేట్' అయినాను. ఓ సాయంత్రం చీకట్లో వెళ్ళి, సందులో ఎవరూలేకండాచూచి తలుపు దబదబ బాదాను. లోపల్నించి చాకలిగావును, 'ఎవరు?' అంటో తలుపు తెరుస్తున్నాడు. పరిగెత్తి వెళ్ళిపోయినాను. నాకు చదువులేదు ఏంలేదు. అదేపని, అదేయోచన. నాలుగురోజులు ఆగి మళ్ళీ అట్లానే తలుపుకొట్టాను. 'ఎవరు?' అంది కోపంతో విశాలాక్షి. ఇంకా గట్టిగాకొట్టాను. కిటికీదగ్గరికివొచ్చి తొంగిచూసింది. నేను కనపళ్ళేదు. చూచి తప్పుకున్నాను. మళ్ళీ తలుపుకొడుతో, 'నువ్వు తెరిచిందాకావదలను' అన్నాను. ఆచప్పుడికి ఎదురింట్లో ఎవరన్నా చూస్తారనికూడాఆలోచించలేదు. లోపలికి తలతీసుకుంది ఇనపకమ్ములనించి. నిశ్శబ్దం. తలుపుదగ్గిరిగానుంచుని,

"ఎందుకు?" అంది.

"తలుపుతియ్యి చెపుతాను"

"ఇప్పుడెట్లా? మనుషులు"

"ఎప్పుడు ఐతే?"

"ఇంకో గంటపోయి"

"నిజమా"

"ఊ...చూడు గదిలోదీపం కనపడితే తలుపుకొట్టకు. కనపడకపోతే మెల్లిగా కొట్టు. అంతచప్పుడేమిటి? అంది.

ఆగంట ఎట్లాగడిపాను? అబద్ధమా? మోసంచేస్తుందా? తన్నిస్తుందా? ఈ ఆలోచనలన్నీ రావలసిందే, ఆవయసులోరావు. అదంతా ముదిరినాక. గంటకే వెళ్లానో, ఇంకా ముందుగానో, గదిలో పెద్దదీపం. కాని ఎవరూ వున్నట్టులేదు, మళ్ళీపోవడం - ఓ గంట జరిగిందనుకుని ఐదు నిమషాలకే రావడం...అట్లా ఎన్నిసార్లో! మరి ఎన్నిగంటలయిందో! దీపంలేదు, నిశిరాత్రి లాగుంది జనసంచారమేలేదు, ఆతలుపు అవునోకాదోకూడా తెలీదు.

మెల్లిగా చప్పుడు చేశాను, ఏమీ చలనంలేదు, ఇంకొంచెం గట్టిగా, ఊహూ, ఏంచెయ్యను? చూశావా? ఎంతమోసం చేసిందో! కసి ఎక్కువయింది, దీన్ని వొదలకూడదు. ఇంటికి ఎట్లా వెళ్లను? ఎట్లా నిద్రపోను? తెగించి ఆ మెట్లమీదే కూచున్నాను. ఏంఆశో తెలీదు. ఎదురుగా రంగులుమారే నక్షత్రం వెలుగుతోంది. కుంటికుక్క తిండికోసం ఎతుక్కుంటోంది. మాఅమ్మ చూస్తే ఆ స్థితిలో - అనుకున్నాను. ఇట్లా ఏవో అర్థంలేని ఆలోచనలు. కాని యవ్వనం. నిద్రపట్టిందిగావును. తలుపుమీదవొరిగానుగావును. రెక్క తెరుచుకుంది. వెనక్కిపడ్డాను. అప్పటికి తెల్లారుతోంది. ద్వాదశినాటి చంద్రవంక ఉదయించింది అని ఈనాటికీ జ్ఞాపకం. అన్నిగంటలూ తలుపు తెరిచేవుంది. ఉలిక్కిపడ్డాను. రెండు నిమిషాలకిగాని జ్ఞాపకంరాలేదు. నిలుచుని మెల్లిగా నడిచాను. ఏంలాభం? ఎవరుంటారు? మోకాళ్ళకి మంచంకొట్టుకుని కళ్లల్లో నరాలు జిల్లుమన్నాయి. మూలిగి మంచంమీదపడ్డాను. కాని విశాలక్షిమీద... నన్ను గట్టిగా కావిలించుకుని, నామీదికి దొర్లింది......"

"ఊఁ"

"అంతే. ఏం ఊఁ? తెల్లారుతున్నా నన్ను వొదల్లేదు ఆపిల్ల. మర్నాడు కూడా నేనుగోపడానికి వొప్పించాను చాలాబలవంతంమీద. నాలుగోరోజున నువ్వు నాగదికివొచ్చి అర్ధరాత్రిదాకా బాతాఖానీ వేశావు. నాతో నీ విరహం చెప్పుకుంటావు. ఏంచెప్పనునీకు? నిన్ను వొదలించుకునేప్పటికి నా పెద్దలు దిగివొచ్చారు. ఇంకొంచెంసేపయితే నిన్ను తన్ని గెంటేద్దును. నేను వెళ్లేప్పటికి......చీకట్లో నా పెదిమలు తగిలేప్పటికి చెక్కిళ్ళన్నీ తడి"

"ఎందుకు?" అన్నాను ముద్దులతోనింపేస్తో

"నువ్వురావేమోనని" అంది దీనంగా

అటుతరవాత నన్ను బతిమాలడం, ప్రతిరాత్రీ రానేమోనని భయాలు. అనవసరంగానే ననుకో. కాని అక్కడ మెత్తదనం కనిపెట్టి దొంగబెట్టు చాలా చేశాను. పరిక్ష చివరిరోజువరకూ మహారాజులాగ అనుభవించాను చీకట్లో, వెన్నెట్లో.

ఆగాడు రాజయ్య. శ్యామారావు వింటున్నాడనే మరిచిపోయాడు. శ్యామారావు కదల్లేదు. బల్లమీద paper weight వంక చూస్తున్నాడు. రాజయ్య మళ్ళీ చెప్పాడు ఈసారి ఆగుతో నెమ్మదిగా.

"రాత్రిపదకొండింటికి వెళ్లానా, తెల్లారకట్ట ఐదింటివరకు ఇద్దరికీ నిద్ర వుండేదికాదు. నెలలో ఇరవైఆరురోజులూ అదే దీక్ష! పరీక్షలకి ఒకటే

చదువుతున్నానని వెక్కిరించేవారు మీరందరూ. జ్ఞాపకముందా? పగలు క్లాసులో విశాలాక్షి కునికిపాట్లు పడి చివాట్లు తింటోవుంటే నాకు జాలేసేది. ఆవీడు ఎట్లానూ పరీక్ష తప్పుతుంది. నాలుగురాత్రులన్నా క్లుప్తంగా పాఠాలన్నీ explain చేద్దామనుకున్నాను. ఆ వుద్దేశ్యంతోనే బయలుదేరేవాణ్ణి. కాని పుస్తకం తెరవకముందే ఎవరోవొకరం...ఆపక్క అక్కడ కనపడుతున్నంతసేపూ చదువు ఎట్లాసాగుతుంది మావెర్రిగాని! అట్లా నెలలతరబడి ప్రతిరాత్రీ కొత్తగా రతిసమరానికి తలబడగల ఆడవాళ్ళే కనపడరు. మా పెద్దఅమ్మాయిని మిలిటరీకి వెళ్ళివొచ్చిన అబ్బాయికిచ్చాము. అంటే కనపడడము అట్లానే వుంటాడులే. పెద్దమీసాలు, ర్రాయివంటిఛాతీ. రెండునెల్లలో పీనిగై పుట్టింటికి చెప్పకండా పరిగెత్తుకొచ్చింది. ఎందుకు వొచ్చావే అంటే చెప్పలేదు. వెనకాలే మర్నాటికి మొగుడుసిద్ధం. అతను వొకటే నవ్వు, "మీ అమ్మాయి ఎందుకు వొచ్చిందో అడగండి" అంటో. నిజంగా అది సమరమే మామధ్య. విశాలాక్షి రాత్రిలు ఓ రాక్షసి అయ్యేది. వూడి విరబోసిన జుట్టూ, పెద్ద శ్వాసా, తుపానులో అలలమల్లే ఎగిరిపడే రొమ్ము ...ఏం ఆడిపోయేది! ఆవేశం పట్టలేక నన్ను కొరికేసిందంటే, రక్తంతో షర్టు తడిసిపొయ్యేది. ఎక్కడపడితే అక్కడ వొళ్ళు తెలీక..."

"ఇంత వ్యవహారం జరుగుతోవుంటే నాకేం తెలీదుకద! వెర్రివాడిమల్లె కలలు కంటున్నాను. పరీక్షలైనాక ఆమెని కలుసుకోవొచ్చుననీ, ఆమెనే పెళ్లిచేసుకుందామనీ, నామల్లేనే ఆమెకూడా నామీదనే మనసుపెట్టుకుని కూచుందనీ. ఎందుకంటే, మాది ఉత్తస్నేహమనుకోను. మా మధ్య ఏమీ జరక్కపోయినా, మా మనసులు మాటలతో కాకుండానే ఎన్నో అన్యోన్యాలు కలుపుకున్నాయి, చూపులు మాట్లాడాయి, చాలా వాగ్దత్తాలు చేశాయి. ఎంతమోసం!"

"ఆమెకి నీమీద గొప్ప ప్రేమఅని చెప్పావుకాదూ?"

"సరేలే. ఆవిశాలాక్షిసరే. ఆమె నాతో మాట్లాడటంలేదని, పీలైనప్పుడుకూడా నానించి పెడమొహంపెట్టి తిరుగుతోందనీ, నాభయాలు, ఆశలు, నిరాశలు, ఎన్ని నీతో చెప్పుకునేవాణ్ణి! ఏమెరగని, ఒకటేతెలీని నంగనాచిమల్లే ఎట్లా వినేవాడివి! పోనీ నాతో..."

"ఎట్లా చెప్పనోయ్. నువ్వే ఆలోచించు."

"అవునులే. కానీ చెప్పు నీకథ"

"పరీక్షలైనాక వారంరోజులు ఉండిపోయినాను. కాని వెళ్లక తప్ప

తుందా ఇంటికి? ఏం ఏడ్చింది ఆరాత్రి! ఆజన్మకీ ముందుజన్మలకీకూడా వాగ్దత్తాలు చేసుకున్నాం"

"అట్లాంటివాళ్లు పెళ్లిచేసుకోకపోయినారా?"

"ఈకాలంలో ఐతే అంతేజరిగేది. కాని ఆకాలంలో ఇంకా భయాలు, కులబేధం, పెద్దవారి అనుజ్ఞలు వగైరా. ఓ రెండేళ్లల్లోనే కలుసుకున్నాము మళ్లీ. చక్రపాణి నామిత్రుడు. మా అత్తవారివూరు అదే. చూసుకునేవాళ్లం. కాని నేను నా భార్యతో కొత్తకాపరపు శృంగారం. అదోరకం అనుభవం. అది మనస్వాంతం. విశాలాక్షికీ భర్తలో అంతేననుకుంటూ - మా వాగ్దత్తాలే ఎగిరిపోయినాయి గాలిలో. అంతే మన ఉద్దేశ్యాలు, వాంఛలూ. చక్రపాణి చచ్చిపోయినప్పుడు, ఆవూళ్లోనే వున్నాను. అ-ఠాత్తుగా గుండె ఆగి, పోయినాడు. ఇంకా బంధువులెవరూ రాలేదు. దహనంచేయించి రాత్రి ఎనిమిదింటికి వాళ్లయింటికే వొచ్చాను. తల్లీకూతురే ఇంట్లో. నన్ను వెళ్ల వొద్దంది. వుండిపోయినాను. రాత్రినిద్రపోతోవుంటే ఏడుపు వినిపించింది. ఆయేడుపులు నాకు చాలా చిరాకు, అసహ్యం. నేనే ఈదేశానికి డిక్టేటర్ని అయితే, చచ్చినప్పుడు ఏడవకూడదని మొదట శాశనం చేస్తాను. ముఖ్యం ఇతరులకి వినపడేట్టు. విసుకుతోలేచి గదిలోకి వెళ్లాను. నన్ను చూడగానే విశాలాక్షి.

"ఇంక నాకు దిక్కెవరు?" అని బిగ్గరగా ఏడ్చింది.

"నేను వున్నాను. నిజం. నమ్ము" అన్నానోలేదో ఆనాటిరాత్రి వాగ్దత్తాలు జ్ఞాపకం వొచ్చాయి.

"నువ్వా! నీసంసారం, పిల్లలూ, పనీ......"

"ఆరాత్రి మన ప్రమాణాలు......"

ఏడుపుమాని నావంకచూసింది. చిన్నచిరునవ్వు

"ఇంకా జ్ఞాపకంవుందా?"

"ఏం? నువ్వు మరిచిపోయినావా?"

"లేదు. కాని, చిన్ననాటి మాటలు"

"అందుకనే అంతబలం వీ! ఏమీభయపడకు"

ఆ 'వీ' అది పూర్వం పిలిచేవాణ్ణి విశాలాక్షిని. ఆమాటవిని కంపించిపోయింది.

"ఆయనకి అన్నీ అప్పులు......"

"కానీ. నేనున్నాను"

"నిజమా ?"

అని నాచెయ్యి పట్టుకుంది. నేను ఆమెకన్నీళ్ళని తుడిచి ఓదార్చాను. తరవాత......మళ్లీ మొదలు - అక్కడే ఆచాపమీద నే......ఏమిటి అట్లా చూస్తావు? ఏమీచిత్రంకాదు. ఇట్లాంటి వ్యవహారాలు చాలావరకు, భార్య నొప్పులుపడేప్పుడూ, భర్తచావులోనూ ప్రారంభమౌతాయి. అప్పుడు హృదయం అసహాయస్థితిలో వుంటుందిగావును. ఏదిదొరికినా ఆధారంగా పట్టుకుంటుంది."

"తరవాత" అన్నాడు గాని శ్యామారావు అతని మనసు ఎక్కడో వున్నట్టుంది.

"అంతే. ఆమెకి భర్తవైరాగ్యాలు ఎక్కువై, తన పాతజీవితంలో చేసిన పాపానికి - అంటే నాతోకలిసి - పశ్చాత్తాపంతో యాత్రలు బైలు దేరిందాకా, కోర్టువ్యవహారాలమూలాన ఆమె మాయింటికి తరుచూ వొచ్చేది. చివరికి కూతుర్ని నాకు ఒదిలి వెళ్లింది రామేశ్వరం. అప్పటికి నాకూ ఆమె మీద పట్టు చల్లబడ్డది."

అని ఇంకేంచెప్పటానికి లేక ఆగాడు రాజయ్య. శ్యామారావువంక చూశాడు. ఎంతసేపయిందో అతను తన ఆలోచనల్లోనే వుండిపోయినట్టు న్నాడు. చివరిదాకా విన్నాడోలేదో.

ఎంతపొద్దుపోయిందో! కిటికీలోంచి వెన్నెల తివాసీమీదనుంచి వాళ్ల పాదాలదాకా పాకింది. రోడ్డుమీదనుంచికూడా ఏమీ చప్పుడులేదు. ఆనిశ్శబ్దంలో బీరువాలో పుస్తకాలూ గోడలూ మాట్లాడ్డం ప్రారంభించా యనిపించింది. ఎంతశేపు కూచున్నారో అట్లామాట్లాడకుండా. శ్యామారావుకి తనమీద చాలాకోపం, అసూయా, అసహ్యం కలిగాయి కావుననుకున్నాడు రాజయ్య. త్వరలోనే, పాతస్మరణలలో అతనికి అశాంతికలిగి లేచివెళ్ళి కిటికీ దగ్గర నుంచున్నాడు, చుట్ట వెలిగించాలని అనుకుంటో. ఒక్క తెల్లని మబ్బు చంద్రుణ్ణి సమీపిస్తోంది. ఎంత వంటరిగావుంటాడో చంద్రుడు నిశిరాత్రి! యవ్వనంలో తమకోసం వెలుగుతో, తమరసికత్వాలకి మెరుగుపెట్టిన మిత్రుడు. ఇప్పుడు? చాలా వొంటరి అనిపించింది జీవితం. వృద్ధాప్యం మొదలా! నిద్రవొస్తోంది. కదలలేదు శ్యామారావు.

"On such a night as this –" అన్నాడు రాజయ్య ఆనిశ్శబ్దాన్ని భరించలేక.

—